మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 19-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 231 Issue: 231

Published from Jagitial www.evarthalu.com

19 ఫిబ్రవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:44 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి విదియ మ. 3:56 వరకు తరువాత తదియ సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పూర్వాభాద్ర రా. 8:40 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం సిద్ధ రా. 8:33 వరకు కరణం కౌలవ మ. 3:56 వరకు తైతుల తె. 3:20o వరకు వర్జ్యం ఉ. 6:09 నుండి ఉ. 7:42 వరకు దుర్ముహూర్తం ఉ. 10:34 నుండి ఉ. 11:20 వరకు మ. 3:11 నుండి మ. 3:57 వరకు రాహుకాలం మ. 1:56 నుండి మ. 3:22 వరకు యమగండం ఉ. 6:44 నుండి ఉ. 8:10 వరకు గుళికాకాలం ఉ. 9:37 నుండి ఉ. 11:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:08 నుండి తె. 5:56 వరకు అమృత ఘడియలు మ. 12:59 నుండి మ. 2:33 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

## ఇక ఫ్రీ బస్.. 'స్మార్ట్'

### టికెట్ల స్థానంలో స్మార్ట్ కార్డులు

**వచ్చే నెల నుంచి అందజేత.. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడి**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): ఫేక్ ఆధార్ కార్డులతో ఉచిత బస్సు ప్రయాణం చేయకుండా ఉండేందుకు తెలంగాణ మహిళలకు స్మార్ట్ కార్డులను జారీ చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఆధార్ కార్డుతోపాటు మరికొన్ని గుర్తింపు కార్డులతో ఉచితంగా మహిళలు ప్రయాణాలు చేస్తుండగా.. ఈ స్మార్ట్ కార్డులు అందించిన తర్వాత వాటిని చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించనున్నారు. త్వరలోనే ఈ నిర్ణయాన్ని తరువాయి 2 వ పేజీలో...




## పైజామా తాడు లాగినా..

## అత్యాచార యత్నం కిందే లెక్క

### సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**అలహాబాద్ హైకోర్టు తీర్పు రద్దు.. జడ్జిలకు సున్నితత్వ శిక్షణ ఇవ్వాలని చురక**

మహిళల స్తనాలను తాకడం, వారి పైజామా తాడును లాగడం వంటి చర్యలు అత్యాచారయత్నం కిందికే వస్తాయని సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ విషయంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద ఆదేశాలను రద్దు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని కస్‌గంజ్ ప్రాంతంలో 2021లో జరిగిన ఓ ఘటన నేపథ్యంలో సుప్రీం ఈ తీర్పును వెలువరించింది.

న్యూఢిల్లీ: 11 ఏళ్ల బాలికను ఇంటి వద్ద దింపుతామని చెప్పి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. మార్గమధ్యంలో ఆమె స్తనాలను అసభ్యంగా తాకి, పైజామా తాడును లాగి దుస్తులు తొలగించేందుకు ప్రయత్నించారు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు -2 వ పేజీలో...



## ఇండియా.. ఏఐ పండుగ!

### సాంకేతిక పరివర్తన దశలో భారత్

- ఇది గొప్ప చరిత్రాత్మక సమయం
- దేశ భవిష్యత్తును నిర్ణయించేలా ఏఐ
- గూగుల్ సీఈవో సుందాయ్ పిచాయ్
- మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు

"జెమినీకి భారత్ అదిపెద్ద మార్కెట్ అని వెల్లడి"




ప్రస్తుతం భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హవా నడుస్తోందని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ అన్నారు. భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఏఐ కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 'ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది' అని పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని తరువాయి 2 వ పేజీలో...

## గల్గోటియాస్.. గోల్‌మాల్

### చైనా రోబో డాగ్ కొని సొంతదని ప్రచారం

**వర్సిటీ చీటింగ్.. ఏఐ సదస్సు నుంచి బహిష్కరణ**




కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో చైనాకు చెందిన రోబో డాగ్ ను తమ ఆవిష్కరణగా ప్రదర్శించిందో యూనివర్సిటీ. ఉత్తరప్రదేశ్ కు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ప్రతినిధులు ఈ నిర్వాకానికి పాల్పడ్డారు. సోషల్ మీడియాలో ఈ రోబోట్ వీడియోలు వైరల్ కాగా.. చైనాకు చెందిన రోబో డాగ్ ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించడంతో యూనివర్సిటీ మోసం బయటపడింది.

న్యూఢిల్లీ: దీంతో యూనివర్సిటీపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. సదస్సు నుంచి ఆ విద్యాసంస్థను తక్షణమే గెంటివేసి, వారికి కేటాయించిన స్టాల్‌ను అధికారులు ఖాళీ చేయించారు. గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ యూనివర్సిటీ ఏఐ సదస్సులో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. తమ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో 'ఓరియాన్' పేరుతో ఒక రోబోడాగ్‌ను స్వయంగా అభివృద్ధి చేశామని వర్సిటీ ప్రతినిధులు ప్రచారం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు తరువాయి 2 వ పేజీలో...



## పెద్దల సభకు ఎన్నికలు

- 10 రాష్ట్రాల్లో 37 స్థానాలకు ఎలక్షన్స్
- తెలంగాణ నుంచి రెండు స్థానాలు
- ఈ నెల 26న నోటిఫికేషన్ రిలీజ్
- మార్చి 16న ఎన్నికలు, కౌంటింగ్

రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలోని రెండు స్థానాలు సహా 10 రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

న్యూఢిల్లీ: ఈ నెల 26వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్, మార్చి 16న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. తెలంగాణ నుంచి సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీలతో పాటు 37 మంది పదవీ కాలం ఏప్రిల్ నెలతో ముగియనుంది. మహారాష్ట్రలో 7, ఒడిశా 4, తమిళనాడు 6, పశ్చిమ బెంగాల్ 5, అసోం 3, బీహార్ 5, ఛత్తీస్‌గఢ్ 2, -2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,420 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,942 |

### విశ్వవాణి



దక్షిణ కొరియాలో ఏటా రెండు సార్లు రెండు ఐలాండ్‌ల మధ్య దారి తెరుచుకుంటుంది. దీన్నే మిరాకిల్ ఆఫ్ జిండో అంటారు. కేవలం గంట పాటు నీళ్లు వెనక్కి వెళ్లి దారి తెరుచుకొనేలా చేస్తాయి. ఆ కొద్ది సమయంలో స్థానిక ప్రజలు, పర్యాటకులు అక్కడికి వెళ్లి ఎంజాయ్ చేస్తుంటారు.

## ఫ్రాన్స్‌కు ఫ్రీ వీసా

### ఆరు నెలల పాటు పైలట్ ప్రాజెక్టు

- ఆ తర్వాత పూర్తి స్థాయిలో అమలు!
- భారతీయ విద్యార్థులకు స్వాగతం
- త్వరలో ముంబైలో అకడమిక్ హబ్
- మోదీ- మేక్రాన్ చర్చల్లో ఒప్పందాలు
- 21 అంశాల్లో ఇరుదేశాల నిర్ణయాలు

ఫ్రాన్స్ వెళ్లాలనుకునే భారతీయులకు ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ శుభవార్త చెప్పారు. ఇండియన్స్‌కు ఫ్రీ వీసా అందించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం.. ఫ్రాన్స్‌కు వెళ్లినా, ఫ్రాన్స్ ద్వారా ఇతర దేశాలకు వెళ్లే భారతీయులు కూడా ఫ్రాన్స్‌కు వీసా లేకుండానే ప్రయాణించవచ్చు. అయితే, దీన్ని మొదటి ఆరు నెలలు పైలట్ ప్రాజెక్ట్ కింద అమలు చేస్తారు.

న్యూఢిల్లీ: ఆ తర్వాత సమీక్షించి పూర్తిస్థాయిలో అమలు చేయడంపై నిర్ణయం తీసుకుంటారు. మేక్రాన్, ప్రధాని మోదీ మధ్య చర్చల అనంతరం అనేక అంశాల్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం ఫ్రాన్స్‌లో చదివేందుకు భారతీయ విద్యార్థులకు అవకాశాలు మెరుగవ్వనున్నాయి. 2030 నాటికి అక్కడ భారతీయ విద్యార్థుల సంఖ్య 30,000కు పెంచాలని నిర్ణయించారు. ఇప్పుడు అక్కడ చదువుతున్న విద్యార్థుల సంఖ్య 10,000గా ఉంది. అంటే -2 వ పేజీలో...



## ఇండస్ట్రీలు.. అవుట్!

### 2034 నాటికి హైదరాబాద్ నెట్ జీరో

**పరిశ్రమలన్నీ ఔటర్ ఆవలకే పంపుతాం.. క్లైమేట్ వీక్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**

గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదాయకమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముంబైలో నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమావేశంలో దేశంలోని పట్టణాలు, నగరాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరించారు.

ముంబై: దేశ పట్టణాభివృద్ధికి సంబంధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతోషంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో తరువాయి 2 వ పేజీలో...




## బీసీలు భళా!

### టీజీ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా.. 61 శాతానికిపైగా సీట్లు కైవసం

**జనరల్ స్థానాల్లోనూ విజయం.. బీసీల చైతన్యానికి నిదర్శనం: బీసీ కమిషన్**

**రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి విజ్ఞప్తి**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ గెలుపొందారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే -2 వ పేజీలో...




### నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు



## బాల్క సుమన్‌కు

## 14 రోజుల రిమాండ్

**సుమన్‌తో పాటు మరో ముగ్గురిని కూడా జైలుకు తరలింపు**

**క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా రగడ**

మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): మంచిర్యాల జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ఘటనలకు సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆయనతో పాటు మరో ముగ్గురికి కూడా కోర్టు రిమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

19.2.2026

మేషం: కొనుగోలు ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన ఫలితాలు పొందుతారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికంగా కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యతతో కానీ పూర్తి కావు ఆర్థికంగా కొంత ఒడిదుడుకులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు కొంత చికాకు కలిగిస్తాయి. వృధా ప్రయాణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు. ఉద్యోగస్తులకు శ్రమ అధికమవుతుంది.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. రుణదాతలు ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులలో అవరోధాలు ఉంటాయి. నూతన వ్యాపారాలు ప్రారంభానికి ఆశించిన సహాయం లభించదు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కర్కాటకం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు. విద్యార్థుల కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. ఆత్మవిశ్వాసంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాల్లో ఆశించిన పురోగతి పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి.

సింహం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వృత్తి ఉద్యోగాలలో నూతన హోదాలు పొందుతారు.

కన్య: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ధన పరంగా ఇబ్బందులు ఎదురవుతాయి. వృత్తి వ్యాపారాలలో అంతంత మాత్రంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

తుల: స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి. మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో మిశ్రమ ఫలితాలు ఉంటాయి. ఉద్యోగ విషయమై అధికారుల నుండి కొంత ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. చాలా కాలంగా వేధిస్తున్న సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు. వ్యాపార ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పని చేసే లాభాలు అందుకుంటారు. గృహమున సంతాన వివాహ విషయమై ప్రస్తావన వస్తుంది.

ధనస్సు: చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. ఆరోగ్యవిషయాలు అశ్రద్ధ చేయడం మంచిది కాదు. జీవిత భాగస్వామితో వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్థులకు అదనపు పని భారం వలన విశ్రాంతి లభించదు.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారపరంగా నూతన ప్రణాళికలు అమలు చేసి లాభాలు అందుకుంటారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. సన్నిహితులతో గృహమున సంతోషంగా గడుపుతారు. వృత్తి ఉద్యోగాలు అనుకూలంగా సాగుతాయి. నిరుద్యోగులకు ఊహించని అవకాశాలు లభిస్తాయి.

కుంభం: ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది.మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరిగి నూతన రుణాలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. వృత్తి ఉద్యోగమున సహోద్యోగులతో సఖ్యతగా వ్యవహరించడం మంచిది.

మీనం: ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది. నూతన వస్తు లాభాలు అందుకుంటారు .గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు అనుకూలత పెరుగుతుంది. భూ సంభందిత క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి.

# గల్గోటియాస్.. గోల్‌మాల్

**మొదటి పేజీ తరువాయి**

సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. యూనివర్సిటీ ప్రదర్శించిన రోబోడాగ్ చైనాకు చెందిన రోబోటిక్ కంపెనీ 'యూనిట్రీ' అభివృద్ధి చేసిన 'గో2' మోడల్‌ను పోలి ఉందని నెటిజన్లు గుర్తించారు. ఆన్‌లైన్ లో సుమారు రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల ధరకు భారతీయులకూ ఈ రోబోడాగ్ అందుబాటులో ఉంది. దీంతో సదరు యూనివర్సిటీ మోసం బయటపడింది. విదేశీ టెక్నాలజీని కొనుగోలు చేసి, దానిని భారత్ ఆవిష్కరణగా ప్రచారం చేసుకోవడంపై నెటిజన్లు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. వివాదం ముదరడంతో యూనివర్సిటీ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది. తాము దానిని చైనా నుంచే కొనుగోలు చేశామని చెప్పింది. విద్యార్థుల పరిశోధనల కోసం ఒక సాధనంగా మాత్రమే వాడుతున్నామని పేర్కొంది. ఆ రోబో డాగ్ ను తామే అభివృద్ధి చేశామని ఎక్కడా ప్రచారం చేసుకోలేదని పేర్కొంది. అయితే, సోషల్ మీడియాలో ఉన్న వీడియోల్లో మాత్రం ఆ విద్యాసంస్థ ప్రతినిధులు ఇది తమ సొంత ఆవిష్కరణ అని స్పష్టంగా చెప్పడం గమనార్హం. అంతర్జాతీయ ప్రతినిధులు, టెక్ దిగ్గజాలు హాజరైన సదస్సులో ఇలాంటి తప్పుదారి పట్టించే చర్యలకు పాల్పడటంపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన గల్గోటియాస్ యూనివర్సిటీ స్టాల్‌ను తొలగించి, సదస్సు నుంచి వారికి ఉద్వాసన పలికింది.

### మీరలా అర్థం చేసుకుంటే ఎలా: వర్సిటీ ప్రొఫెసర్లు

రోబో డాగ్‌ను తామే అభివృద్ధి చేసినట్లు గల్గోటియాస్ యూనివర్సిటీ పేర్కొన్నట్లుగా వార్తలు రావడంపై ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు స్పందించారు. ఈ చైనీస్ ఏఐ ఆధారిత రోబో డాగ్‌ను తాము అభివృద్ధి చేసినట్లు ఎప్పుడూ చెప్పలేదని, సోషల్ మీడియాలో ఈ ప్రచారం జరిగిందని ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ నేహా సింగ్ మాట్లాడుతూ, రోబోకు సంబంధించిన ప్రత్యేకతలను వివరిస్తున్న క్రమంలో కొన్ని వ్యాఖ్యలను పొరపాటుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తమ విద్యార్థులు రోబోటిక్ సైన్స్ గురించి ఎలా అధ్యయనం చేస్తున్నారో, ఏం అభివద్ధి చేస్తున్నారో వివరించే క్రమంలో కొంత తప్పుడు సంకేతాలు వెళ్లాయని అన్నారు. తమ వ్యాఖ్యలను కొన్నింటిని తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు.



# ఇండియా.. ఏఐ పండుగ!

**మొదటి పేజీ తరువాయి**

ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి, దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావించారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని వివరించారు. సరైన పెట్టుబడులు, విధానాలు అమలు చేస్తే, భారతదేశ సమగ్ర అభివృద్ధికి, దీర్ఘకాలిక పరివర్తనకు ఏఐ ఒక శక్తివంతమైన సాధనంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫ్రాన్స్‌కు ఫ్రీ వీసా

**మొదటి పేజీ తరువాయి**

రాబోయే నాలుగేళ్లలో మరో 20,000 పెంచాలని భావిస్తున్నారు. దీని ద్వారా మన విద్యార్థులకు సులభంగా ఫ్రెంచ్ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులకు అవకాశాలు వస్తాయి. మన విద్యార్థుల కోసం ముంబైలో అకడమిక్ హబ్ కూడా ఏర్పాటు చేస్తుంది ఫ్రాన్స్. అలాగే ఇరు దేశాల డిగ్రీలను రెండు దేశాలు అంగీకరించే అంశంలో కూడా చర్చలు నడుస్తున్నాయి. ఇరు దేశాల మధ్య 21 అంశాల్లో కీలక ఒప్పందాలు జరిగాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఏఐ, హెల్త్‌కేర్, డెవలప్‌మెంట్, కల్చరల్, రక్షణ, ఎడ్యుకేషన్, ట్రేడింగ్, డిజిటల్ పేమెంట్స్, అంతర్జాతీయ దౌత్య సేవలు, సహజ వనరులు వంటి అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇండియా -- ఫ్రాన్స్ మధ్య 114 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. రూ.3.25 లక్షలతో ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ యుద్ధ విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది.

# బీసీలు భళా!

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టమైన నిదర్శనమని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ గుర్తుచేసింది. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసినవారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

**మొదటి పేజీ తరువాయి**

ఆరోపణలతో మంగళవారం రాత్రి ఆయనపై కేసు నమోదైంది. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. వివరాల్లోకి వెళితే, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కాన్వాయ్‌ను బీఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో మంత్రి ప్రయాణిస్తున్న కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడికి బాల్క సుమన్ నాయకత్వం వహించారని, పోలీసుల బారికేడ్లను స్వయంగా ఆయనే మంత్రి కాన్వాయ్‌పైకి విసిరారని ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించిన వీడియో ఫుటేజీలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై మంత్రి వివేక్ తీవ్రంగా స్పందించారు.

## నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): బుధవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైంది. సాయంత్రం వేళలో నెలవంక కనిపించినట్లు రుయాతే హిలాల్ హైదరాబాద్ (దక్కన్) కమిటీ వెల్లడించింది. దీంతో మసీదుల్లో సైరన్లను మోగించారు. ఒకరికొకరు చాంద్ ముబారక్ (నెలవంక దర్శనం) శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక తరబీహ్ నమాజ్‌లు ప్రారంభం కావడంతో ముస్లింల ఇళ్లలో రంజాన్ సందడి మొదలైంది.




# ఇక ఫ్రీ బస్.. 'స్మార్ట్'

**మొదటి పేజీ తరువాయి**

అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు. స్మార్ట్ కార్డులు జారీ చేసిన తర్వాత కేవలం.. స్మార్ట్ కార్డులు కలిగి ఉన్న మహిళలకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇక మహిళలకు ఈ స్మార్ట్ కార్డులు జారీ చేసే విషయాన్ని ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఈ స్మార్ట్ కార్డుల కోసం 3 నమూనాలను రెడీ చేసి ప్రభుత్వానికి పంపించినట్లు వెల్లడించారు. అందులో ఒక నమూనాను ప్రభుత్వం ఖరారు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే వచ్చే నెల నుంచి తెలంగాణ మహిళలకు ఈ స్మార్ట్ కార్డులను జారీ చేయనున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఈ స్మార్ట్ కార్డులను జారీ చేసిన తర్వాత.. బస్సుల్లో మహిళలకు జీరో టికెట్లు జారీ చేసే ప్రక్రియ మరింత సులభం అవుతుందని స్పష్టం చేశారు.

## పైజామా తాడు లాగినా.. అత్యాచార యత్నం కిందే లెక్క

**మొదటి పేజీ తరువాయి**

రావడంతో నిందితులు పరారయ్యారు. ఈ కేసులో విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు, నిందితుల చర్యలు అత్యాచార యత్నం కిందకు రావని, కేవలం 'సన్నద్ధత' మాత్రమేనని పేర్కొంటూ నిందితులపై ఉన్న అత్యాచార యత్నం అభియోగాలను తగ్గించింది. ఈ తీర్పుపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు సుమోటోగా (తనంతట తానుగా) విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు వ్యాఖ్యలు సున్నితత్వం లేకుండా, అమానవీయంగా ఉన్నాయని పేర్కొంది. నిందితులపై అత్యాచార యత్నం సెక్షన్లను పునరుద్ధరించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. భవిష్యత్తులో న్యాయమూర్తులకు సున్నితత్వ శిక్షణపై ఓ కమిటీని ఏర్పాటు చేయాలని నేషనల్ జ్యుడిషియల్ అకాడమీకి సూచించింది.

## పెద్దల సభకు ఎన్నికలు

**మొదటి పేజీ తరువాయి**

హర్యానా 2, హిమాచల్ ప్రదేశ్ 1, తెలంగాణలో 2 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ విడుదల, మార్చి 5 నామినేషన్ దాఖలు చేయడానికి చివరి గడువు, మార్చి 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

# ఇండస్ట్రీలు.. అవుట్!

**మొదటి పేజీ తరువాయి**

గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యాలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్సీ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొలాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, వైద్యులు, శాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమంగా గుర్తింపు పొందే విధంగా అభివృద్ధి సాధించిందని వివరించారు. 1991 నుంచి 2020 వరకు లిబరలైజేషన్, ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ సంస్కరణలతో భారత్ సేవా రంగంలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని సీఎం వివరించారు. టెలికాం, సాఫ్ట్ వేర్ విప్లవంతో పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ సాధ్యమైందని అన్నారు. భారత నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రపంచ కేంద్రాల్లో విజయాలు సాధించారని తెలిపారు. 1991 తర్వాత గ్లోబల్ సాఫ్ట్ వేర్, టెక్ సంస్థలు తమ బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు భారత్‌ను ఎంచుకున్నాయని అన్నారు. అందుకే ప్రపంచంలో అత్యధిక గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు మన దేశంలో ఉన్నాయన్నారు. అయితే, ఈ టెక్ పురోగతిలో తయారీ రంగం ఎక్కువగా అవకాశాలు కోల్పోయినట్లు అభిప్రాయపడ్డారు. కోవిడ్ అనంతరం ప్రభుత్వాల దృష్టికోణం మారిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత్వం కీలకంగా మారాయని అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అన్నారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగం



అభివృద్ధికి కొలమానంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ, రాష్ట్ర జీడీపీని 200 బిలియన్ డాలర్ల స్థాయి నుంచి 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విద్య, నైపుణ్యాలు, వనరులు, ఉపాధి ప్రధాన స్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధికి తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లుగా విభజించినట్లు వివరించారు. ఇక, తెలంగాణ విద్యుత్ వినియోగంపై గణాంకాలను వెల్లడించారు. రాష్ట్రం రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్ వినియోగిస్తోందని తెలిపారు. గత ఏడాది గరిష్ట డిమాండ్ 17,162 మెగావాట్లు నమోదైందని, ఈ ఏడాది అది 19,000 మెగావాట్లను దాటుతుందని అంచనాలున్నాయని వివరించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో గరిష్ట డిమాండ్ 34,000 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 24.8% లేదా దాదాపు 25% గ్రీన్ సోర్సుల నుంచే వస్తోందని తెలిపారు.



## అర్హులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

**ఐఅండ్ పీఆర్ కమిషనర్ ప్రియాంక**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం కొత్త అక్రెడిటేషన్ కార్డులను జారీ చేయనున్న విషయం తెలిసిందే. జీవో నెం.252 ప్రకారం ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాతో పాటు ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు ష్ట్రజూ://అజూతీ.వశ్రీఖఅస్త్రుఖఱ.స్త్రశీజ.ఱఅ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుంచే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, అక్రిడిటేషన్ల దరఖాస్తు, కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో జర్నలిస్టులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, వాటి పరిష్కారం కోసం మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. సందేహాల కొరకు హెల్ప్ లైన్ నంబర్ 9154170881ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ హెల్ప్‌లైన్ కార్యాలయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని పేర్కొన్నారు.

## ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ రాత పరీక్షకు 3,760 మంది అర్హత

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కీలక అప్‌డేట్ జారీ చేసింది. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ రాత పరీక్షకు 3,760 మంది అర్హత సాధించినట్లు టీఎస్ఎల్పీఆర్బీ వెల్లడించింది. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ విభాగాల్లో మొత్తం 60 పోస్టుల భర్తీకి గతేడాది నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటికి సంబంధించి ఈ ఏడాది జనవరిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం 37,600 మంది అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేశారు. రాత పరీక్షకు అర్హత సాధించిన వారికి మార్చి 5,6,7 తేదీల్లో మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. పోస్టుల వారీగా రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాబితా షష్ఞ.స్త్రజూతీఎ.ఱఅ అందుబాటులో ఉందని అధికారులు వెల్లడించారు. ఈ రాత పరీక్షకు అర్హత పొందని అభ్యర్థులెవరైనా ఈ విషయంలో స్పష్టత కోరాలని భావిస్తే షష్ఞ.స్త్రజూతీఎ.ఱఅ వెబ్ సైట్ ద్వారా అప్లికేషన్ కు అవకాశం కల్పించారు.

## కాంగ్రెస్‌కు వడ్డీతో కలిపి ఇస్తాం

**బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్.. క్యాతన్‌పల్లి కైవసానికి కుట్ర అని ఆరోపణ**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌వి ముసుగు రాజకీయాలు

**చైర్మన్ పీఠం కోసం అడ్డదారులు.. మాజీమంత్రి హరీశ్ రావు ఆగ్రహం**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మురుగు రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... క్యాతనపల్లిలో బీఆర్ఎస్‌కి పూర్తి మెజారిటీ వచ్చినా కాంగ్రెస్ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరును యావత్ తెలంగాణ అసహ్యించుకుంటోందని అన్నారు. అధికార బలం, ధన బలంతో చట్టాలను కాంగ్రెస్ తుంగలో తొక్కుతోందని విమర్శించారు. పోలీసులు కూడా అధికార పార్టీకి పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక చర్యలను అడ్డుకున్నందుకు దళిత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని హరీశ్ రావు పేర్కొన్నారు. "జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్ కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు దాడి చేశారు. అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదు" అని ఆయన మండిపడ్డారు. క్యాతనపల్లి, తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవించలేదని దుయ్యబట్టారు. చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని ఆరోపించారు.

# విద్య వైద్యానికి ప్రాధాన్యం

**యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు.. దేశంలోనే మోడల్ గా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు .. ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయిస్, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల బడ్జెట్ సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు.**

**మంత్రి అజారుద్దీన్ తో కలిసి మైనార్టీ సంక్షేమ శాఖ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆలోచించి, నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సంక్షేమ శాఖకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు ఎంత తొందరగా పంపితే అంత తొందరగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): ప్రపంచ స్థాయి ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని అన్ని వర్గాల విద్యార్థులు ఉమ్మడి కుటుంబం లా కలిసిపోవడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. విద్యార్థులు, టీచింగ్ స్టాఫ్ కు బయోమెట్రిక్ విధానం లేకపోతే వెంటనే అమలులోకి తీసుకురావాలని వాటిని కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ బిల్డింగ్ ల పైన సోలార్ పవర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ తో సమావేశమై ఏర్పాటు చేసుకోవాలని కరెంటు భారం లేకుండా చేసుకోవడమే కాదు, సోలార్ ద్వారా ఆదాయం సృష్టించుకోవచ్చని తెలిపారు. వసతి గృహాలు, సంక్షేమ హాస్టళ్లకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం కొత్త మెనూ అమల్లోకి తీసుకు వచ్చాం, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం వి నేపథ్యంలో జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులు వసతి గృహాలను సందర్శించి అన్ని విషయాలను పరిశీలించాలని వీలైతే ఒక రోజు రాత్రి అక్కడే బస చేయాలని గతంలోనే ఆదేశించాం, ఆ ప్రక్రియ ఎంత మేరకు కొనసాగుతుందో సెక్రటరీలు ఆయా జిల్లా కలెక్టర్ల ద్వారా పర్యవేక్షణ జరపాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వసతి గృహాల అద్దెలను క్లియర్ చేస్తున్నామని తెలిపారు. హాస్టల్ బిల్డింగుల మరమ్మతు బిల్లులు ఉంటే వెంటనే పంపాలని వెనువెంటనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వరి సాగు పెద్ద ఎత్తున చేయడం, బాయిల్డ్ రైస్ ను తమిళనాడు వంటి రాష్ట్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడం నేపథ్యంలో భవిష్యత్తులో రాష్ట్ర రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉన్న నేపథ్యంలో పంట మార్పిడికి అవకాశాలను పరిశీలించాలని నీటిపారుదల శాఖ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. వరి స్థానంలో పామ్ ఆయిల్, పప్పు ధాన్యాలు సాగు చేస్తూ, పంట నిలువల స్టోరీ ఈ సామర్థ్యాన్ని రాష్ట్రంలో పెంచాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. తమ ప్రభుత్వం బీసీ లకు బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పిస్తుంది.. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గ్రీన్ చానెల్ ద్వారా డైట్ ఉ కాస్మొటిక్ ఛార్జీలు విద్యార్థులకు స్కాలర్ షిప్ లు విడుదల చేస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. గత ప్రభుత్వం గురుకుల పాఠశాలలు అద్దెలు సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉంచేదని ప్రజా పాలన ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టల్ ప అద్దెలు చెల్లిస్తుంది. ఈసారి బడ్జెట్ లో బీసీ లలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వారి ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు ప్రారంభించాలని కోరడం జరిగిందనీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా లక్ష్మీ ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా జరుగుతుంది. ప్రభుత్వం మహా లక్ష్మీ నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తుంది. మహా లక్ష్మీ కి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో బస్సులు సంఖ్య కూడా గణనీయంగా పెంచడం జరుగుతుంది. త్వరలోనే ఆర్టీసీ లో ప్రయాణించే మహిళలకు మహా లక్ష్మీ కార్డులను ప్రతి ఇంటింటా పండగల అందించడం జరుగుతుందనీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ కు వచ్చి ఆర్థికంగా, ఇతరత్రా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశంలో, రాష్ట్రంలో అత్యుత్తమ ఉపాధ్యాయులను గుర్తించి హైదరాబాద్ నుంచి ఆన్లైన్లో పాఠాలు బోధిస్తారని ఇది దేశంలోనే ఒక మోడల్ గా మారబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న విలువైన స్థలాల్లో భారీ బవంతులు నిర్మించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు భవనాలు నిర్మించే ఆలోచనలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు మిస్ చార్జీలు, అద్దెలు క్లియర్ చేయడం అభినందనీయమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, హాస్టల్లో మోడల్ కిచెన్లు ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని ఈ ప్రక్రియను దశలవారీగా ప్రారంభించాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో రహదారుల నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్ఆర్ఆర్, హైదరాబాద్– విజయవాడ, ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు, రావిర్యాల నుంచి శ్రీశైలం వరకు రహదారుల నిర్మాణం పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి హడ్కో నుంచి రుణం తీసుకునేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రీ బడ్జెట్ సమావేశంలో సంతకం చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో, ప్రధానంగా హైదరాబాద్ కేంద్రంలో సంవత్సరం పొడుగునా కల్చరల్ యాక్టివిటీ కొనసాగేలా సినిమాటోగ్రఫీ శాఖలో ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, రవాణా,రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, సివిల్ సప్లై శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంక్షేమ శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# నర్సులకు 20 వేల జీతమివ్వాలి

**క్రెడిట్ పాయింట్ల పేరుతో వేధించొద్దు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): నర్సింగ్ సిబ్బంది మనో వేదనను అర్థం చేసుకోవాలని, క్రెడిట్ పాయింట్ల పేరుతో వారిని వేధింపులకు గురి చేయొద్దని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. క్వాలిఫైడ్ నర్స్ ల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కు ఐదేళ్లలో 150 క్రెడిట్ పాయింట్లు సాధించి ఉండాలని కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఈ నిబంధనలు తెచ్చిన తర్వాత తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ వాటిపై కనీస అవగాహన కల్పించే ప్రయత్నాలు చేయలేదని గుర్తు చేశారు. తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో 80 వేల మంది నర్సింగ్ సిబ్బంది తమ రిజిస్ట్రేషన్ల రెన్యూవల్ కు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్వాలిఫైడ్ నర్స్ లు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి ఐదేళ్లలో 150 గంటల కంటిన్యూయింగ్ నర్సింగ్ ఎడ్యుకేషన్ క్రెడిట్ అవర్స్ కలిగి ఉండాలనే నిబంధన తెచ్చినట్టు కూడా చాలా మందికి అవగాహన లేదన్నారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తీసుకువచ్చిన ఈ కొత్త నిబంధనపై తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ అవగాహన కల్పించలేదని తనను కలిసిన పలువురు నర్సింగ్ సిబ్బంది వాపోయారని తెలిపారు. 150 రిజిస్ట్రేషన్ లు రెన్యూవల్ చేస్తామంటూ తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వడం పూర్తిగా ఏకపక్షమే. నర్సింగ్ కేవలం వృత్తి మాత్రమే కాదు సేవ చేయడం. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజల ప్రాణాల రక్షణ కోసం సేవలందించే నర్సింగ్ సిబ్బంది రిజిస్ట్రేషన్ ల రెన్యూవల్ విషయంలో ఇలాంటి కఠిన నిబంధనలు సరికాదని అన్నారు. ఉద్యోగాలు చేస్తూ నర్సింగ్ సిబ్బంది నెలకు కనీసం రెండు కాన్ఫరెన్స్ లకు హాజరయితే తప్ప నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల మేరకు క్రెడిట్ పాయింట్స్ సాధించడం సాధ్యం కాదన్నారు. కరోనా కాలంలో నర్సింగ్ కాన్ఫరెన్స్ లు నిర్వహించలేదనే విషయం తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఐదేళ్లకు 150 క్రెడిట్ పాయింట్ల విధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్స్ లకు కనీస వేతనం రూ.20 వేలు అమలు చేస్తూ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ సిబ్బందిపై వేధింపులు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## నికోబార్ ప్రాజెక్టుపై సోనియా కుట్ర

**అడ్డుకొనేందుకు అంతర్జాతీయ కుట్రదారులతో చేతులు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు**



అంతర్జాతీయ వాణిజ్య రవాణా కోసం కేంద్రం రూ. 80 వేల కోట్లతో గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు చేపడితే ముందుకు వెళ్ళకుండా అంతర్జాతీయ కుట్రదారులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలు చేతులు కలిపారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ట్రాన్స్‌షిప్‌మెంట్‌లో ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును ఇబ్బంది పెట్టడానికి, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సోనియా గాంధీ గతంలో ఓ ఆంగ్ల పత్రికలో పూర్తి అబద్ధాలతో వాస్తవాలను వక్రీకరించారని మండిపడ్డారు. సోనియాగాంధీ చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలని తేల్చుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్ట్ కు పచ్చజెండా ఊపిందన్నారు. బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ భారత భూభాగమైన నికోబార్ దీవుల్లో హిందూ మహాసముద్రం, పసిఫిక్ సముద్రాన్ని కలిపే అత్యంత కీలకమైన మలక్కా జలసంధి సమీపంలో ప్రాజెక్టు చేపడుతున్నట్లు తెలిపారు. బంగాళాఖాతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యూహాత్మక, ఆర్థిక, రవాణా హబ్‌గా అత్యంత కీలకమైన ఒక వాణిజ్య కేంద్రంగా తయారు చేయాలని ఈ ప్రాజెక్ట్ ను నిర్మించాలని లక్ష్యంగా మోడీ సర్కార్ పెట్టుకుంది. భారతదేశం ప్రస్తుతం ట్రాన్స్‌షిప్‌మెంట్ కోసం విదేశీ ఓడరేవులపై ఎక్కువగా ఆధారపడుతోంది. దీనిని కాస్త తగ్గించుకోవడానికి మలక్కా జలసంధికి సమీపంలో అంతర్జాతీయ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, అంతర్జాతీయ విమానాశ్రయం, విద్యుత్ ప్లాంట్, టౌన్‌షిప్‌ను నిర్మించడం ద్వారా ఈ ప్రాంతంపై పట్టుసాధించుకోవాలనుకుంటుందన్నారు. భారత్ వస్తు రవాణా కోసం విదేశీ ఓడరేవులపై ఎక్కువగా ఆధారపడుతుండటంతో గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ఎంతో మనకెంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కు అడ్డంకులు సృష్టించేందుకు అంతర్జాతీయంగా, మన దేశంలోనూ చాలామంది ప్రయత్నించారని విమర్శించారు. ఒక వైపు ప్రధాని మోడీ వికసిత్ భారత్‌ను నిర్మించడానికి తన జీవితాన్ని అంకితం చేస్తుంటే, మరోవైపు చాలా మంది భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అడ్డంకులు సృష్టించడానికి కృషి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. భారతదేశాన్ని, దేశ పురోగతిని వ్యతిరేకించే వారి కుట్రలు కుతంత్రాలు నెరవేరవని వీరి దుష్టబుద్ధి ప్రజలకు అర్థమైందన్నారు.

## మరి నవరాత్రుల సంగతేంది?

**రంజాన్ వెసులుబాటుపై అర్చకుడి నిలదీత**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ముస్లిం ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం కల్పించిన వెసులుబాటుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది పూర్తిగా ఓటు బ్యాంకు రాజకీయమేనని సిద్ధ పీఠ్ హనుమాన్‌గఢీకి చెందిన ప్రధాన అర్చకుడు దేవేశాచార్య మహారాజ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయం దురదృష్టకరమని ఆయన బుధవారం వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ, "ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఎంతకైనా దిగజారుతున్నారు. హిందువులకు కూడా నవరాత్రులు లేదా ఇతర పండుగల సమయంలో ఇలాంటి సౌకర్యం కల్పిస్తారా? కల్పించరని నేను భావిస్తున్నాను. గతంలో తెలంగాణ ప్రభుత్వం హిందువుల పండుగ సెలవులను కూడా రద్దు చేయడానికి ప్రయత్నించింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకే కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వెసులుబాటు ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు అమల్లో ఉంటుందని మెమోలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలన్నింటికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం ఉద్యోగులు సకాలంలో ఇళ్లకు చేరుకుని ప్రార్థనలు చేసుకోవడానికి, ఉపవాసం విరమించడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ముస్లింలకు రంజాన్ అత్యంత పవిత్రమైన మాసం. ఈ నెల రోజుల పాటు వారు సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

## విడాకులు ఇచ్చిందని మాజీ భార్య హత్య

వనస్థలిపురం–హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): తనకు విడాకులు ఇచ్చిందన్న కారణంతో ఒక వ్యక్తి తన మాజీ భార్యను హతమార్చిన సంఘటన హైదరాబాద్‌లో జరిగింది. వనస్థలిపురంలోని గ్రీన్ సిటీ కాలనీలో ఓ అపార్టుమెంట్‌లో ఉంటున్న సునీతకి గతంలో మహేశ్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. మనస్పర్థలు రావడంతో ఇరువురు విడిపోయారు. సునీత ఏడాది క్రితం అతడికి విడాకులు ఇచ్చి, మరొక వ్యక్తిని వివాహం చేసుకుంది. దీంతో మహేశ్ ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఆమె ఇంట్లోకి కత్తులు, పెట్రోల్ డబ్బాతో చొరబడి దారుణంగా హత్య చేశాడు. ఇంట్లోకి ఎవరైనా వస్తే పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించాడు. ఘటన అనంతరం మహేశ్ పారిపోతుండటం గమనించిన అపార్టుమెంట్ వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## హౌసింగ్ బోర్డు ప్లాట్లకు 14.75 కోట్లు

రాజేంద్రనగర్–హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. ఈ క్రమంలోనే బుధవారం రోజున బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి. ఈ ప్లాట్లను అమ్మడం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది. దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది.

# మన అధ్యక్షురాలు రమాదేవికి ఆత్మీయ సత్కారం



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): మున్నూరుకాపు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (మన) నూతన అధ్యక్షురాలు ముడిచింతల రమాదేవి నగరానికి వచ్చిన సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు గోపిశెట్టి ప్రమోద్ నేతృత్వంలో సంఘం ప్రతినిధులు ఆమెను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తర అమెరికాలో మున్నూరుకాపు సమాజ ఏకీకరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇమ్మిగ్రేషన్, మ్యాట్రిమోనీ, సంపద నిర్మాణం, వ్యవస్థాపకత, పెట్టుబడి రంగాల్లో సభ్యులకు సహాయ సహకారాలు, సలహాలు సూచనలు అందిస్తున్నట్లు ఆమె వివరించారు. గత ఏడాది 60కి పైగా ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన వర్క్ షాప్ లకు మంచి స్పందన లభించిందని ఆమె పేర్కొన్నారు. మన సంస్కృతి పరిరక్షణలో భాగంగా సీతారామ కళ్యాణం, వనభోజనాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మన మాజీ అధ్యక్షుడు మాగంటి రమేష్, అనిల్ ముడిచింతల, ప్రొఫెసర్ సుంకరి రాంమూర్తి, డాక్టర్ పుంజాల వినయ్ కుమార్, పుంజాల అలేఖ్య, లయన్ ఆకుల రవీందర్ రావు, వైల శ్రీనివాస్ రావు, ఆకుల రామారావు, లవంగాల అనిల్ కుమార్, మంగళారపు లక్ష్మణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్‌లో గట్ల సాత్విక్ ప్రతిభ

జగిత్యాల, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): జేఈఈ మెయిన్ 2026 సెషన్ -1 ఫలితాలలో జగిత్యాల పట్టణానికి చెందిన గట్ల సాత్విక్ నారాయణ 99.59 శాతం సాధించాడు. జగిత్యాలలో పదవ తరగతి పూర్తి చేయగా ఇంటర్ హైదరాబాద్‌లో చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ పొలాస వ్యవసాయ పరిశోధనాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించడమే తన లక్ష్యమని సాత్విక్ తెలిపాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు సాత్విక్‌ను అభినందించారు.




## 21, 22న హరిహర కళాభవన్‌లో జాబ్ మేళా

సోమాజిగూడ–హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సదుద్దేశంతో ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ హైదరాబాద్ చేంజ్ మేకర్స్ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవి ముక్కిడి మాట్లాడుతూ.. డాక్టర్ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో దాదాపు 50 కంపెనీలు పాల్గొననున్నాయని, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. రిజిస్ట్రేషన్ పూర్తి వివరాల కోసం 9505504994 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



## శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

మల్యాల, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళలు వివిధ రంగాల్లో శిక్షణ పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత పిలుపునిచ్చారు. మల్యాల మండల కేంద్రంలో బుధవారం న్యాక్, బిఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నైపుణ్య శిక్షణ ద్వారా స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్యాల సర్పంచ్ బొట్ల జయప్రసాద్, ఎమ్మార్వో వసంత, ఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పసిబిడ్డపై పైశాచికం: షర్మిల

మదనపల్లె, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై జరిగిన హత్యాచారం అత్యంత దారుణమని, గంజాయి మత్తులో ముక్కుపచ్చలారని పసిబిడ్డపై జరిగిన ఈ పైశాచిక ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ దారుణ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నామని, బాలిక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాలు ఏరులై పారుతున్నాయనడానికి మదనపల్లె ఘటనే నిదర్శనమని షర్మిల ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై డేగ కన్ను పెట్టామని, ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడమంతా ఆర్భాటమేనని విమర్శించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారమంతా తూతూ మంత్రంగానే మిగిలిపోయిందని ఆమె దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాధిత బాలిక కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పైశాచిక ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో వ్యక్తిగతంగా దృష్టి సారించాలని, గంజాయి, డ్రగ్స్ సరఫరాపై ఉక్కుపాదం మోపడంతో పాటు నిరంతరం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి రాష్ట్రాన్ని కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని షర్మిల స్పష్టం చేశారు.

## కల్తీ నెయ్యిపై చర్చ రండి: అనిత

తిరుమల, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు. చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు.

# చెరువులో శవమై..!





**'మదనపల్లె' నిందితుడి ఆత్మహత్య**

మదనపల్లె, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని, ఆ తర్వాత చెరువులో శవమై తేలాడు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన కులవర్ధన్ (30) కురబలకోట మండలం కనసానిపల్లి చెరువులో మరణించి కనిపించడం తీవ్ర కలకలం రేపింది. నిందితుడిని మంగళవారం పోలీస్ వాహనంలో తరలిస్తుండగా తప్పించుకున్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం ఉదయం చెరువులో మృతదేహం లభ్యమైందని జిల్లా ఎస్పీ కె. ధీరజ్ మీడియాకు వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఇది ఆత్మహత్యగా భావిస్తున్నామని, నిందితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. వివరాల్లోకి వెళితే, మదనపల్లె పట్టణానికి చెందిన చేనేత కార్మికుడి ఏడేళ్ల కుమార్తె సోమవారం అదృశ్యమైంది. రెండో తరగతి చదువుతున్న ఆ చిన్నారి, పాఠశాలకు సెలవు కావడంతో ఇంటి దగ్గర ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. పనుల నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు, కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు, బాధితురాలి పొరుగింట్లో ఉండే కులవర్ధన్‌కు నేరచరిత్ర ఉండటంతో అతనిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు అతని ఇంటికి వెళ్లగా లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో, కిటికీలోంచి చూడగా నిద్రపోతూ కనిపించాడు. అయితే, బాలిక చివరిసారిగా కులవర్ధన్‌తోనే కనిపించిందని మృతురాలి తాత చెప్పడంతో పోలీసులు మరుసటి రోజు ఉదయం ఇంట్లోకి ప్రవేశించి చూడగా, నీళ్ల డ్రమ్ములో బాలిక మృతదేహం లభ్యమైంది. వెంటనే కులవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో తప్పించుకు పారిపోయాడు. ఈ దారుణ ఘటనపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు జాతీయ రహదారిపై బైఠాయించి గంటల తరబడి రాస్తారోకో నిర్వహించారు. డీఐజీ కోయ ప్రవీణ్ మాట్లాడుతూ, పోస్టుమార్టం నివేదిక ప్రకారం నిందితుడు బాలికపై అత్యాచారం చేసి, ఆ తర్వాత నీటి డ్రమ్ములో ముంచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడని వెల్లడించారు. నిందితుడిపై గతంలో సెక్షన్ 324 కింద కేసు నమోదైందని, అది లోక్ అదాలత్‌లో రాజీ అయినట్లు పోలీసులు తెలిపారు. అతను తరచూ మద్యం తాగి అసభ్యంగా ప్రవర్తించేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## బొత్సకు హెరిటేజ్ లీగల్ నోటీసులు

**సంస్థపై తప్పుడు ఆరోపణలు చేశారని ఆరోపణ**

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): వైసీపీ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ లీగల్ నోటీసులు జారీ చేసింది. తమ సంస్థపై నిరాధారమైన, అసత్య ఆరోపణలు చేసి ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపిస్తూ హెరిటేజ్ తరఫున న్యాయవాది మల్లికార్జునరావు ఈ నోటీసులు పంపారు. బొత్స చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకుని, తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ నోటీసులో హెచ్చరించారు. హెరిటేజ్ సంస్థపై బొత్స సత్యనారాయణ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలో భాగమేనని నోటీసులో పేర్కొన్నారు. ముఖ్యంగా, తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేని ఇందాపూర్ డెయిరీ పేరును ప్రస్తావిస్తూ, ఆ డెయిరీ ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేశారని ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థ 22 కంపెనీలతో సిండికేట్ ఏర్పాటు చేసిందంటూ చేసిన ఆరోపణల్లోనూ ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. హెరిటేజ్ ఫుడ్స్ ఎన్నో ఏళ్లుగా చట్టబద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తోందని, ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు, గుర్తింపు పొందిందని నోటీసులో వివరించారు. ప్రీమియం బ్రాండ్‌గా ప్రజల్లో నమ్మకాన్ని చూరగొన్న తమ సంస్థపై ఇలాంటి నిరాధార వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. భారతీయ న్యాయ సంహిత 356 ప్రకారం పరువు నష్టం కలిగించినందుకు సమాధానం చెప్పాలని బొత్సను డిమాండ్ చేశారు. చేసిన ఆరోపణలపై వెంటనే క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తప్పవని హెరిటేజ్ సంస్థ స్పష్టం చేసింది.

# జైలు జీవితం ఎంజాయ్ చేశా: అంబటి



రాజమండ్రి, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని తాను శిక్షగా కాకుండా ఒక శిక్షణగా భావించానని అన్నారు. అయితే, ఈ సమయంలో తాను ఎదుర్కొన్న ఏకైక ఇబ్బంది బాత్రూంలో జారిపడటమేనని, అది మినహా జైలు జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేశానని వ్యాఖ్యానించారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని చంద్రబాబు, లోకేశ్ అనుకున్నారేమో. కానీ, ఈ అంబటి రాంబాబు ఎవరికీ భయపడే ప్రశ్నే ఉద్భవించదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పుడే జైల్లో ఉండటానికి సిద్ధపడ్డాను. నన్ను జైల్లో పెట్టాలని వారు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు, ఇప్పుడు అవకాశం దొరికింది, లోపల పెట్టారు. కానీ కాలం మళ్లీ తిరిగొస్తుంది. వారు చేసిన పాపానికి మూల్యం చెల్లించక తప్పదు" అని అంబటి హెచ్చరించారు. జైలు తనలో మరింత కసిని, పట్టుదలను పెంచిందని, ఒక్క అడుగు కూడా వెనక్కి వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తన ఇంటిపై జరిగిన దాడి ఘటనను పూర్తిగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. "సుమారు ఏడు గంటల పాటు నా ఇంటిపై దుండగులు దాడి చేస్తుంటే పోలీసులు అక్కడే ఉన్నారు. వారి సమక్షంలో, వారి రక్షణలోనే ఈ దాడి జరిగింది. నన్ను రక్షించాల్సిన పోలీసులే 'సార్, మీరు గోడ దూకి పారిపోండి' అని చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇది ఆటవిక రాజ్యం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారికి వెంటనే బెయిల్ వచ్చిందని, బాధితుడినైన తనకు మాత్రం 18 రోజుల తర్వాత బెయిల్ లభించిందని అన్నారు. తన భార్యాబిడ్డలను, మనవళ్లను భయభ్రాంతులకు గురిచేశారని, తనను చంపడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించారు. జైల్లో అధికారులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని, తాను ప్రత్యేక సౌకర్యాలు ఏవీ కోరలేదని అంబటి తెలిపారు. "జైల్లో పెట్టే ఆహారమే తిన్నాను. అది నాకు నచ్చలేదు. కానీ కలకాలం తినను కదా? బయటి భోజనం కోసం కోర్టు అనుమతి ఇవ్వలేదు. అందుకే లోపలి భోజనమే చేశాను. అందుకే కొంచెం చిక్కినట్టు ఉన్నా, ఆరోగ్యంగానే ఉన్నాను. ఎలాంటి ఇబ్బంది లేదు" అని వివరించారు. జగన్ నాయకత్వంలోనే తన రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని, ప్రాణం ఉన్నంతవరకు ఆయన వెంటే నడుస్తానని అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా, ఎన్నిసార్లు జైల్లో పెట్టినా తాను వెనకడుగు వేయనని, ప్రజాస్వామ్యబద్ధంగా ఈ కూటమి ప్రభుత్వాన్ని కూల్చేంతవరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై తనకు పూర్తి సమాచారం లేదని, అన్ని విషయాలు తెలుసుకుని గుంటూరులో రేపు విలేకరుల సమావేశంలో సమగ్రంగా మాట్లాడతానని ఆయన వెల్లడించారు.






# ఐఎన్ఎస్ సుమేధపై రాష్ట్రపతి ప్రయాణం

**విశాఖ తీరంలో నౌకాదళ విన్యాసాలు**

**వేడుకల్లో కదం తొక్కిన 71 యుద్ధ నౌకలు**

వైజాగ్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వేడుకలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో పాటు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా నౌకాదళ సిబ్బంది నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె ఐఎన్ఎస్ సుమేధ యుద్ధ నౌకలో ప్రయాణించారు. రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. సముద్ర అలలపై వరుసగా నిలిచిన యుద్ధ నౌకలను వారు వీక్షించారు. ఈ ఫ్లీట్ రివ్యూలో భారత నావికాదళ సత్తాతో పాటు ప్రపంచ దేశాల నౌకలు కూడా కదం తొక్కాయి. ఆరు వరుసల్లో మొత్తం 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. భారత నేవీకి చెందిన 45 నౌకలతో పాటు కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ మరియు పరిశోధన నౌకలు ఇందులో పాల్గొన్నాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశాఖ సముద్ర తీరం యుద్ధ నౌకల గర్జనలు, నావికాదళ విన్యాసాలతో సందడిగా మారింది. దేశ రక్షణలో నౌకాదళం పోషిస్తున్న కీలక పాత్రను ఈ వేడుక ప్రతిబింబించింది.

## ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నిక ఆర్వో నిర్ణయమే!

**తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

ఇబ్రహీంపట్నం–హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఈవార్తలు): ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. ఛైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారి (ఆర్వో)దేనని హైకోర్టు స్పష్టం చేసింది. 16వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆకుల యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 16వ వార్డు నుంచి గెలిచిన తన తండ్రి యాదగిరి అదృశ్యమయ్యారంటూ కుమారుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యాదగిరిని హైకోర్టులో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం ఛైర్మన్ ఎన్నికలపై హైకోర్టు పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడగానే తనను బలవంతంగా చీరాలకు తీసుకువెళ్లారని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనను రెండు రోజుల పాటు బలవంతంగా రిసార్టులో ఉంచారని అన్నారు. హైదరాబాద్‌లో 12 గంటల పాటు కారులో తిప్పారని కోర్టు దష్టికి తీసుకువెళ్లారు. హైకోర్టు ఉత్తర్వులతో తాను మంగళవారం కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యానని అన్నారు.

## శభాష్.. బండీ!



**సంజయ్‌కు అధిష్ఠానం కంగ్రాట్స్**

న్యూఢిల్లీ: టీజీ మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడమే కాకుండా కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంపట్ల బీజేపీ అగ్ర నాయకత్వం సంతోషం వ్యక్తం చేసింది. రాష్ట్రం ఏర్పడ్డాక బీజేపీ తొలిసారి కార్పొరేషన్ మేయర్ పదవిని చేజిక్కించుకోవడం అభినందనీయమని పేర్కొంది. బుధవారం నగర శివారులో పండిట్ దీన్ దయాళ్ మహా ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పార్టీ సంస్థాగత వ్యవహారాల సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ ప్రకాశ్ జీ, అగ్ర నాయకులు తరుణ్ చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, పార్టీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ శభాష్.. బండి సంజయ్ అంటూ అభినందనలు తెలపడంతోపాటు సన్మానించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోనూ మంచి ఫలితాలు సాధించిన స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు సైతం పార్టీ నాయకత్వం అభినందనలు తెలిపింది.

# ప్రియురాలిని చంపి.. రేప్!

## ఆత్మను పిలిచేందుకు తాంత్రిక పూజలు.. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఘటన



ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అత్యంత భయానక, అమానుష ఘటన వెలుగుచూసింది. తనతో పాటు ఎంబీఏ చదువుతున్న ప్రియురాలిని ఓ యువకుడు అతి కిరాతకంగా రేప్ చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె మృతదేహంపై లైంగిక చర్యలకు (నెక్రోఫిలియా) పాల్పడి, ఆపై ముంబై పారిపోయి ఆమె ఆత్మతో మాట్లాడేందుకు తాంత్రిక పూజలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ కేసులో నిందితుడైన పీయూష్ ధమనోటియా (24)ను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఫిబ్రవరి 10న 24 ఏళ్ల ఎంబీఏ విద్యార్థిని, కాలేజీ స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే రాత్రి 11 గంటల సమయంలో ఆమె ఫోన్ నుంచి తండ్రికి "పాప ఇంటికి రాదు" అని సందేశం వచ్చింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. అదే సమయంలో, ఆమె కాలేజీ వాట్సాప్ గ్రూప్‌లో 11 అసభ్యకర వీడియోలు పోస్ట్ అయ్యాయి. ఈ వీడియోల గురించి కాలేజీ యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల తర్వాత, నిందితుడు పీయూష్ అద్దెకు ఉంటున్న గది నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు బద్దలుకొట్టి చూడగా, యువతి మృతదేహం నగ్నంగా, కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆమె కాళ్లకు ఉన్న సాక్స్‌ల ఆధారంగా తండ్రి తన కూతురి మృతదేహాన్ని గుర్తించారు. విచారణలో పీయూష్ చెప్పిన విషయాలు పోలీసులనే దిగ్భ్రాంతికి గురిచేశాయి. శారీరక సంబంధానికి నిరాకరించడంతో, ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశానని ఒప్పుకున్నాడు. ప్రతిఘటించడంతో చేతులు, కాళ్లు కట్టేసి, నోట్లో గుడ్డ కుక్కి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక కత్తితో పొడిచాడు. ఆ తర్వాత గదిలోనే మృతదేహం పక్కన కూర్చుని బీరు తాగాడు. అంతటితో ఆగకుండా మృతదేహంపై లైంగిక చర్యలకు పాల్పడ్డానని అంగీకరించాడు. హత్య తర్వాత ఆమె ఫోన్‌ను ధ్వంసం చేసి, ముంబైకి పారిపోయాడు. అక్కడ పాన్‌వెల్ ప్రాంతంలో యూట్యూబ్‌లో వీడియోలు చూసి, ఆమె ఆత్మను పిలిచి క్షమాపణ చెప్పేందుకు తాంత్రిక పూజలు చేశాడు. ముంబై పోలీసుల సహకారంతో పీయూష్‌ను అరెస్ట్ చేసి ఇండోర్‌కు తరలించారు. విచారణలో అతను "ఏం జరగాల్సి ఉందో అది జరిగిపోయింది" అంటూ నిర్లక్ష్యంగా, నవ్వుతూ సమాధానాలు చెప్పడం అతని మానసిక స్థితికి అద్దం పడుతోంది. తన ప్రియురాలు డేటింగ్ యాప్‌లో ఇతరులతో మాట్లాడుతోందన్న అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిందితుడు తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ఆర్మేనియాకు ఫ్రీ వీసా

**భారతీయులకు ఆఫర్.. జూలై 1 వరకు అమలు**

న్యూఢిల్లీ: భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఆర్మేనియా ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. పర్యాటకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో, కొన్ని షరతులకు లోబడి భారతీయులకు తాత్కాలిక వీసా రహిత ప్రవేశాన్ని ప్రకటించింది. ఈ విధానం ఈ ఏడాది జూలై 1 వరకు అమలులో ఉంటుంది. ఈ సమయంలో అర్హులైన భారతీయులు వీసా లేకుండానే ఆర్మేనియాలో ప్రవేశించి, ఏడాదికి గరిష్ఠంగా 180 రోజుల వరకు ఉండవచ్చు. అయితే, ఈ అవకాశం భారత పాస్‌పోర్ట్ ఉన్న అందరికీ వర్తించదు. అమెరికా, యూరోపియన్ యూనియన్, షెంజెన్ దేశాలు, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్ వంటి దేశాల్లో చెల్లుబాటు అయ్యే రెసిడెన్స్ పర్మిట్ (నివాస అనుమతి) ఉన్న భారతీయులు మాత్రమే ఈ వీసా మినహాయింపుకు అర్హులు. ప్రయాణికులు ఆర్మేనియాలో ప్రవేశించే నాటికి వారి రెసిడెన్స్ పర్మిట్ కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ కలిగి ఉండటం తప్పనిసరి. ఈ కొత్త విధానంపై ఆర్మేనియా టూరిజం కమిటీ ఛైర్‌పర్సన్ లుసిన్ గెవోర్గ్యాన్ మాట్లాడుతూ.. "ఇది ప్రయాణికులకు మా ఆహ్వానం. 2026లో మరింత మంది పర్యాటకులను స్వాగతించడానికి మేం సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా పర్యాటకాన్ని పెంచడంతో పాటు, వ్యాపార, కుటుంబ పర్యటనలను సులభతరం చేయాలని ఆర్మేనియా ప్రభుత్వం భావిస్తోంది. పురాతన ఆలయాలు, యునెస్కో వారసత్వ కట్టడాలు, అందమైన పర్వత ప్రాంతాలకు ఆర్మేనియా ప్రసిద్ధి. ముఖ్యంగా గల్ఫ్, అమెరికా, యూరప్ దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు ఈ వీసా మినహాయింపు ఒక మంచి అవకాశంగా మారింది. ఇది తాత్కాలిక విధానం మాత్రమేనని, 2026 జూలై 1 తర్వాత సాధారణ వీసా నిబంధనలు తిరిగి వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరిన్ని వివరాల కోసం ఆర్మేనియా విదేశాంగ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# పాక్‌తో ఆడటం అవసరమా?

**కేంద్రంపై సంజయ్ రౌత్ ఆగ్రహం**

ముంబై: ఇండియా–పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగే సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు పరస్పరం కరచాలనం చేసుకోకపోవడం పట్ల శివసేన ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడాల్సిన అవసరమే లేదు. ఒకవేళ ఆడాలంటే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి. షేక్‌హ్యాండ్ ఇవ్వకపోతే బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆటగాళ్లపై దాదాగిరీ చేస్తున్నట్లే అవుతుంది. అసలు మీరెందుకు ఆడుతున్నారు? పాకిస్థాన్‌తో ఆడటం పూర్తిగా ఆపేస్తే ఏమవుతుంది?" అని రౌత్ ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు ఐసీసీ టోర్నీల్లో తలపడిన సమయంలో భారత ఆటగాళ్లు కరచాలనం చేసుకోవడానికి నిరాకరిస్తున్నారని... ఇది బీజేపీ, కేంద్ర ప్రభుత్వం దాదాగిరీ వల్లే జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఆసియా కప్‌లోనూ, గత ఆదివారం టీ20 వరల్డ్ కప్‌లోనూ ఇదే సీన్ రిపీట్ అయిందని చెప్పారు. పాకిస్థాన్‌తో ఇండియా మ్యాచ్‌లు ఆడడం వల్ల బెట్టింగుల్లో వేల కోట్లు ఆర్జిస్తున్నారని, దీంట్లో సగం డబ్బు పాకిస్థాన్‌కు వెళుతుందని, ఆ డబ్బు నేరుగా దావూద్ ఇబ్రహీం, మసూద్ అజార్ వంటి ఉగ్రవాదులకు చేరుతుందని, దీని వల్ల ఉగ్రవాదం మళ్లీ బలపడుతుందని రౌత్ ఆరోపించారు.

# భారత్‌కు వస్తనో.. రానో!

**బాంబే హైకోర్టుకు విజయ్ మాల్యా వెల్లడి**



ముంబై/లండన్: భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి లండన్ పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాను భారత్‌కు తిరిగి రాలేనని బాంబే హైకోర్టుకు తెలియజేశారు. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదని అన్నారు. తాను బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని, అందుకే ఎప్పుడు తిరిగి వచ్చేది చెప్పలేనని తెలిపారు. ఈ మేరకు విజయ్ మాల్యా తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ బాంబే కోర్టులో ఒక స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. మాల్యా దగ్గర యాక్టివ్ ఇండియన్ పాస్‌పోర్టు లేదని, అదేవిధంగా దేశం దాటి వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని కోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపడానికి నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే మాల్యా భారత్‌కు రాకుండా ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా, లేదా? అని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. ఈ పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ అమిత్ దేశాయ్ కోర్టులో వాదనలు వినిపించారు.

## వాషింగ్టన్ మేయర్ రేసులో..

# భారత సంతతి మహిళ



వాషింగ్టన్: అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన మరో మహిళ కీలక ముందడుగు వేశారు. దేశ రాజధాని వాషింగ్టన్ డీసీ మేయర్ పదవికి జరిగే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు తమిళనాడు మూలాలున్న రిని సంపత్ (31) బుధవారం ప్రకటించారు. డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న ఆమె.. నగరంలో మౌలిక వసతులను సరిదిద్దడం, పాలనపై ప్రజలకు నమ్మకం కలిగించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రిని సంపత్, తన ప్రచారాన్ని ప్రస్తుత నగర నాయకత్వంపై విమర్శలతో ప్రారంభించారు. "మేయర్‌గా, నగర పాలనలో కనీస హామీలను నిలబెట్టడమే నా ప్రాధాన్యత. రోడ్లపై గుంతలు పూడ్చడం, మురుగునీటి సమస్యను పరిష్కరించడం, ధరలు తగ్గించడం, 911 కాల్స్ వెయిటింగ్ టైమ్ తగ్గించడం వంటివి చేస్తాను" అని ఆమె తెలిపారు. తన ఉద్యోగంలో ప్రాథమిక విధులు నిర్వర్తించడంలో విఫలమైన వారికి ప్రమోషన్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తూ, నగర కౌన్సిల్‌లో ఏళ్లుగా పనిచేస్తున్న రాజకీయ నాయకులను ఆమె పరోక్షంగా విమర్శించారు. ఇటీవల కురిసిన మంచు తుపాను సమయంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా మారాయని, చెత్త పేరుకుపోయిందని, పాత నీటి పైపులైన్లు పగిలిపోయాయని ఆమె గుర్తుచేశారు. ఈ సమస్యల వల్ల ప్రజలు పనులకు వెళ్లలేక ఆదాయం కోల్పోయారని, వ్యాపారాలు కూడా నష్టపోయాయని తన ప్రచార వీడియోలో పేర్కొన్నారు. "నేను రాజకీయ నాయకురాలిని కాదు. నాకు ఎలాంటి ప్రత్యేక ప్రయోజన బృందాల మద్దతు లేదు. ప్రభుత్వ సేవలను మెరుగుపరచడమే నా వృత్తి" అని ఆమె అన్నారు. తమిళనాడులోని తేనిలో జన్మించిన రిని, ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి అమెరికాకు వలస వెళ్లారు. పబ్లిక్ సర్వీస్‌లోకి రావడానికి తన తాతయ్యే స్ఫూర్తి అని, తమ కుటుంబం మెరుగైన జీవితం కోసం తన తండ్రి తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఎంతో ప్రేరణనిచ్చిందని ఆమె వివరించారు. తన ప్రజాసేవకు తన కుటుంబ నేపథ్యమే స్ఫూర్తి అని రిని ఉద్ఘాటించారు. "మా తాత నాకు ఎప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటారు. ఆయన ఏడో తరగతి, మా అమ్మమ్మ ఒకటో తరగతి మాత్రమే చదువుకున్నారు. అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన నేను అమెరికా రాజధానిలో జీవించడం, ఈ గొప్ప జీవితాన్ని అనుభవించడం నాకు చాలా గొప్ప విషయం" అని తెలిపారు. మెరుగైన జీవితం కోసం తమను అమెరికాకు తీసుకురావడానికి తన తండ్రి ఎంతో రిస్క్ తీసుకున్నారని, ఆయనే తనకు ఆదర్శమని చెప్పారు. తమిళం తన మాతృభాష అని తెలిపిన రిని, ఇప్పటికే తన ప్రచారానికి 15,000 డాలర్లకు పైగా నిధులను సమీకరించారు. వాషింగ్టన్ డీసీలో డెమొక్రటిక్ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉండటంతో, ఆ పార్టీ ప్రైమరీలో గెలుపే మేయర్ పదవికి కీలకం కానుంది.

# సర్వం ఏఐ నుంచి 30బీ, 105బీ!

బెంగళూరు: బెంగళూరుకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ సర్వమ్ ఏఐ, దేశీయ ఏఐ రంగంలో కీలక ముందడుగు వేసింది. బుధవారం జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో రెండు కొత్త లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లను ఆవిష్కరించింది. స్వదేశీ ఏఐ సామర్థ్యాలను నిర్మించుకోవాలన్న భారత ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మోడళ్లను అభివృద్ధి చేసినట్లు కంపెనీ తెలిపింది. 'మిక్చర్–ఆఫ్–ఎక్స్‌పర్ట్స్' అనే అధునాతన ఆర్కిటెక్చర్‌తో ఈ మోడళ్లను రూపొందించారు. వీటిలో మొదటిది 'సర్వమ్ 30బీ' మోడల్. ఇది 30 బిలియన్ పారామీటర్లతో పనిచేస్తుంది. ఈ నిర్మాణం వల్ల పనితీరు మెరుగ్గా ఉండటమే కాకుండా, ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్ కుమార్ వివరించారు. ఈ మోడల్ 32,000 టోకెన్ల కాంటెక్స్ట్ ను సపోర్ట్ చేస్తుంది. అదేవిధంగా, 105 బిలియన్ పారామీటర్లతో మరో శక్తివంతమైన మోడల్‌ను కూడా సర్వమ్ ఏఐ పరిచయం చేసింది. ఇది మరింత సంక్లిష్టమైన ఆదేశాలను సైతం అర్థం చేసుకుంటుంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి మోడళ్లతో ఇది పోటీ పడుతుందని ప్రత్యూష్ కుమార్ తెలిపారు. గూగుల్ అభివృద్ధి చేసిన జెమిని ఫ్లాష్ కన్నా తక్కువ ఖర్చుతో మెరుగైన ఫలితాలు ఇస్తుందని, ముఖ్యంగా భారతీయ భాషల విషయంలో దీని పనితీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. విదేశీ ఏఐ వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం 'ఇండియా ఏఐ మిషన్' ప్రారంభించిన విషయం తెలిసిందే. రూ.10,000 కోట్ల నిధులతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ మిషన్ కింద జీపీయూ సబ్సిడీలను పొందిన అతిపెద్ద లబ్ధిదారుగా సర్వమ్ ఏఐ నిలిచింది. దాదాపు రూ.99 కోట్ల సబ్సిడీతో 4,096 ఎన్విడియా హెచ్100 జీపీయూలను దక్కించుకుంది. ఇండియా కోసం ఫౌండేషనల్ ఏఐ మోడల్‌ను నిర్మించేందుకు ఎంపికైన తొలి కంపెనీ కూడా ఇదే. వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ కలిసి 2023 జులైలో సర్వమ్ ఏఐని స్థాపించారు.




## దేశ భద్రతకు రాహుల్ ప్రమాదం: కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు పెట్టుకున్నారని ఆరోపించారు. దేశ భద్రతకు రాహుల్ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని మండిపడ్డారు. దేశీయంగా, విదేశీ పర్యటనల్లో రాహుల్ నక్సలైట్లు, తీవ్రవాదులు, జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక భావజాలం ఉన్న వ్యక్తులతో సమావేశాలు జరుపుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కూడా రాహుల్ గాంధీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయాలని కోరుతూ లోక్ సభలో మోషన్ ప్రవేశపెట్టారు. జార్జ్ సోరోస్ వంటి దేశ వ్యతిరేక శక్తుల సాయంతో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆయనపై జీవితకాల నిషేధం విధించాలని కోరారు.

# రాఫెల్‌లో భారత పరికరాలు!

**ఫ్రాన్స్‌కు రాజ్‌నాథ్ అభ్యర్థన**

న్యూఢిల్లీ: రాఫెల్ ఫైటర్ జెట్‌లలో 50 శాతం దేశీయ తయారీ పరికరాలు ఉండేలా చూసుకోవాలని ఫ్రాన్స్‌ను కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ కోరారు. ఫ్రాన్స్‌తో రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకోనుంది. ఈ నేపథ్యంలో రాఫెల్ ఫైటర్ విమానాలలో భారత తయారీ పరికరాలు ఉండాలని కోరారు. ఇందులో భాగంగా ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యంలో కో–డిజైన్, కో–డెవలప్‌మెంట్, కో–ప్రొడక్షన్ వంటి అంశాలు చేర్చినట్లు తెలుస్తోంది. రూ.3.25 లక్షల కోట్ల అంచనాతో 114 రాఫెల్ యుద్ధ విమానాల సరఫరాకు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.

# రామ్మోహన్ నాయుడిని తొలగించాలి

**రోహిత్ పవార్ డిమాండ్**



ముంబై: గత నెలలో బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ మరణంపై విచారణ పూర్తయ్యే వరకు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, డీజీసీఏ ఉన్నతాధికారులను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ఎన్సీపీ (శరద్ పవార్) పార్టీ శాసనసభ్యుడు రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈ విమాన ప్రమాదంపై కుట్రపూరిత కోణంలోనూ దర్యాప్తు చేయాలని కోరారు. ఈ ప్రమాదానికి సంబంధించి కంపెనీ యాజమాన్యం, విమానం ఫిట్‌గా ఉందని నిర్ధారించిన సాంకేతిక సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా సీబీఐ దీనిని దర్యాప్తు చేయాలని అన్నారు. భద్రతా సమస్యల కోణంలోనూ విచారణ జరగాలని, దీనిని సీబీఐకి అప్పగించాలని కోరుతూ ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీ నాయకులు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో ఎన్సీపీ (శరద్ పవార్) వర్గం కూడా సీబీఐ దర్యాప్తుకు డిమాండ్ చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్ నడుపుతున్న ఈ విమానాల్లో గతంలోను భద్రతా లోపాలు తలెత్తాయని, కాబట్టి వారి విమానాలను నిలిపివేయాలని రోహిత్ పవార్ కోరారు. ఫ్లైట్ రికార్డర్ దెబ్బతిన్నట్లు వచ్చిన వార్తలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానంలోని చివరి క్షణాలకు సంబంధించిన ఆధారాలను నాశనం చేయడానికి ఇది ఒక స్క్రిప్ట్ అని ఆరోపించారు. ప్రమాదవశాత్తు విమానం కూలిపోవచ్చు కానీ కుట్ర కోణంలో దర్యాప్తు చేయాలని ఆయన అన్నారు.

# టవల్‌తో గొంతు నులిమి హత్య

**భార్యను హత్య చేసిన ఇస్రో రిటైర్డ్ అధికారి**

**బెంగళూరులో తీవ్ర విషాదం**

బెంగళూరు: బెంగళూరు నగరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లో పనిచేసి పదవీ విరమణ చేసిన ఓ అధికారి, తన భార్యను అత్యంత దారుణంగా హత్య చేశాడు. తీవ్రమైన డిప్రెషన్‌తోనే ఆయన ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వివరాల్లోకి వెళితే.. దక్షిణ బెంగళూరులోని బొమ్మనహళ్లి ప్రాంతంలో ఉన్న 'ది వర్ఛ్యూసో' అపార్ట్‌మెంట్‌లో బుధవారం ఈ ఘటన జరిగింది. ఇస్రో మాజీ ఉద్యోగి నాగేశ్వర్ రావు (65), తన భార్య సంధ్యశ్రీని టవల్‌తో గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంట్లోనే ఉండి, తన పరిచయస్తుడు ఒకరికి ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపాడు. ఆ వ్యక్తి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఉదయం 11 గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుని నాగేశ్వర్ రావును అరెస్ట్ చేశారు. పోలీసులు వచ్చే వరకు నాగేశ్వర్ రావు ఘటన స్థలంలోనే ఉన్నాడు. పోలీసుల కథనం ప్రకారం, నాగేశ్వర్ రావు కొంతకాలంగా తీవ్ర డిప్రెషన్‌కు చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవాలని భావించిన అతడు, తాను చనిపోయే ముందు భార్యను కూడా చంపేయాలని నిర్ణయించుకుని ఈ దారుణానికి ఒడిగట్టాడు. "నిందితుడు డిప్రెషన్‌తో చాలా ఒత్తిడిలో ఉన్నాడు. ఘటన తర్వాత ఆత్మహత్య చేసుకోవాలని భావించి భార్యపై దాడి చేశాడు. దీని వెనుక ఇతర పెద్ద కారణాలేవీ లేవని తెలుస్తోంది," అని వైట్‌ఫీల్డ్ డీసీపీ సైదులు అదవత్ మీడియాకు తెలిపారు. ఈ దంపతులకు అమెరికాలో నివసిస్తున్న ఒక కుమార్తె ఉండగా, ఆమెకు ఈ విషయంపై సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.


# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగినప్పటికీ, దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, మెటల్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో వెల్లువెత్తిన కొనుగోళ్లు మార్కెట్లకు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 283 పాయింట్లు పెరిగి 83,734 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 93 పాయింట్లు లాభపడి 25,819 వద్ద నిలిచింది. నిఫ్టీ లాభాల్లో ముగియడం ఇది వరుసగా మూడో సెషన్ కావడం గమనార్హం. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ సూచీ 1.23 శాతం నష్టపోగా, మిగిలిన అన్ని సూచీలు గ్రీన్ మార్క్‌లో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు వరుసగా 1.21 శాతం, 1.33 శాతం, 1.31 శాతం చొప్పున లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లు కూడా సూచీలకు అనుగుణంగానే రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.50 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.54 శాతం లాభపడ్డాయి. ఉదయం సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్న మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత బలమైన రికవరీ కనబరిచాయి. సెన్సెక్స్ తన కనిష్ట స్థాయి అయిన 83,206 నుంచి 585 పాయింట్లకు పైగా పుంజుకుంది. దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ) నుంచి పెట్టుబడులు నిలకడగా కొనసాగడం మార్కెట్లకు బలమైన మద్దతు ఇస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయ వృద్ధి అవకాశాలపై ఉన్న సానుకూల దృక్పథంతో సెంటిమెంట్ బలంగానే ఉందని వారు తెలిపారు. మరోవైపు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 2 పైసలు స్వల్పంగా బలహీనపడి 90.66 వద్ద ట్రేడ్ అయింది. బీఎస్ఈలో 2,110 షేర్లు లాభపడగా, 1,916 షేర్లు నష్టపోయాయి.

# ఇమ్రాన్ ఖాన్ హత్యకు కుట్ర

**అసిమ్ మునీర్, నఖ్వీ ప్లాన్లు**

**ఇమ్రాన్ సోదరి ఆరోపణలు**



ఇస్లామాబాద్: తన సోదరుడి హత్యకు కుట్ర పన్నారని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తోబుట్టువులు ఉజ్మా ఖాన్, అలీమా ఖాన్ సంచలన ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ అసిమ్ మునీర్, పీసీబీ చీఫ్ మొహిసిన్ నఖ్వీ తమ సోదరుడి హత్యకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయం స్వయంగా ఇమ్రాన్ ఖాన్ తమకు చెప్పారని ఆందోళన వ్యక్తం చేశారు. తనను చంపుతారని, చంపడానికి పథకం వేశారని ఇమ్రాన్ ఖాన్ తమతో చెప్పారని అన్నారు. మొహిసిన్ నఖ్వీ తమను బెదిరింపులకు గురిచేస్తున్నాడని వారు ఆరోపించారు. తమకు లేదా తమ సోదరుడికి ఏమైనా జరిగితే ఎవరినీ వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. రావల్పిండి జైలు గదిలో ఇమ్రాన్ ఖాన్ చాలా కాలంగా ఒంటరిగా ఉండటంతో క్రమంగా కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని పాకిస్థాన్ సుప్రీంకోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో వెల్లడైన విషయం తెలిసిందే. ఇమ్రాన్ ఖాన్ కుడికన్ను చూపు 85 శాతం కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
గురువారం 19-2-2026 | www.evarthalu.com 

వయ్యారి చిత్రం


నియతి ఫత్నాని

## నిర్మాతలను ఆడిస్తున్నారు

టాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా పేరు తెచ్చుకున్న దిల్ రాజు, ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొని నిర్మాతల కష్టాలపై ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పెద్ద సినిమాలు తీయడమే కాకుండా, కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా 'దిల్ రాజు



ప్రొడక్షన్స్' అనే బ్యానర్‌ను ప్రారంభించిన ఆయన, ప్రస్తుత కాలంలో నిర్మాతల పరిస్థితిని వివరించారు. "ప్రస్తుత రోజుల్లో నిర్మాతలకు విలువ లేదు. గతంలో అట్లూరీ పూర్ణచంద్రరావు వంటి నిర్మాతలు ఉండేవారు, వారికి ఉన్న విలువ వేరు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. సూపర్‌స్టార్ రజినీకాంత్ ఒకసారి చెప్పినట్లు.. 'నిర్మాత అంటే కేవలం ఇచ్చేవాడు మాత్రమే, మిగిలిన అందరూ తీసుకునేవాళ్లే'. ఇండస్ట్రీలో అందరూ లాభాలు ఆశిస్తారు, కానీ నష్టాలను మోసేది మాత్రం నిర్మాత ఒక్కడే" అని దిల్ రాజుఎమోషనల్ అయ్యారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'దిల్' సినిమా గురించి మాట్లాడుతూ ఒక ఆసక్తికర సంఘటనను పంచుకున్నారు. "నేను నిర్మాతగా మారిన మొదట్లో అట్లూరీ పూర్ణచంద్రరావు గారికి ఒక మాట ఇచ్చాను. 'దిల్' సినిమాను హిందీలో రీమేక్ చేయాలనుకుంటే, ఆ సినిమా రైట్స్ ఆయనకు ఉచితంగా ఇస్తానని చెప్పాను. ఆయనపై ఉన్న గౌరవంతో ఆ రోజు ఆ నిర్ణయం తీసుకున్నాను" అని దిల్ రాజు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మీరా జాస్మిన్ సెకండ్ ఇన్నింగ్స్!



మీరాజాస్మిన్ మళ్లీ టాలీవుడ్ లో కంబ్యాక్ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. వేర్వేరు భాషల్లో సెకెండ్ ఇన్నింగ్స్ కొనసాగిస్తోన్న నేపథ్యంలో తెలుగులో మళ్లీ ఎందుకు పని చేయకూడదు అన్న ఆలోచన నుంచి అమ్మడు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. గతంలో ఉన్న పాత పరిచయాలతో టాలీవుడ్ మేనేజర్లకు టచ్ లో కి వెళ్తోందని తెలిసింది. మీరాజాస్మిన్ వయసు 44 ఏళ్లు. కీలక పాత్రలటకు..క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మంచి అవకాశాలు వస్తాయి. అంతకంటే ముందే సీనియర్ హీరోలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ చెప్పొచ్చు. చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున లాంటి స్టార్లకు మ్యాచ్ అవుతుంది. ఆ నలుగురు హీరోలకు హీరోయిన్ల సమస్య ఎప్పుడూ ఉంటుంది. కాబట్టి మేకర్స్ సీనియర్లకు జోడీగా ఎంపిక చేయొచ్చు. ప్రస్తుతం మాలీవుడ్, కన్నడలో కూడా సీనియర్ హీరోల చిత్రాల్లోనే నటిస్తోంది. మోహన్ లాల్ హీరోగా నటిస్తోన్న 366 చిత్రంలో ఈ భామే హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో ఆమె నైసీ అనే పాత్రలో మోహన్ లాల్ కు భార్య గా నటిస్తోంది. దాదాపు 13 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం మరో ఇంట్రెస్టింగ్ విషయం. లాల్ నటించిన గత సినిమాల్లోనూ మీరాజాస్మిన్ నటించింది. అయితే అవి పూర్తి స్థాయి పాత్రలు కాదు. మీరాజాస్మిన్ నటిగా ఎదిగే క్రమంలో వచ్చిన అవకాశాలు అవన్నీ. తాజా అవకాశం పట్ల అమ్మడు ఎంతో సంతోషంగా ఉంది.

## నేను ప్రపంచ నటిని: మంచు లక్ష్మి



మంచు లక్ష్మికి భాషల పరంగా ఒక ఇంట్రెస్టింగ్ ప్రశ్న ఎదురైంది. తమిళంలో ఆమె స్లాంగ్ ఎలా ఉంటుందో చూడాలని ఉందని, అక్కడ వర్క్ చేయడం ఎలా అనిపించిందని ఒక రిపోర్టర్ అడిగారు. దానికి సమాధానంగా ఆమె తమిళంలో అనర్గళంగా మాట్లాడి అందరినీ సర్ప్రైజ్ చేశారు. ఒక ఆర్టిస్ట్ గా తనను తాను ఒకే భాషకు పరిమితం చేసుకోవడం ఇష్టం లేదని ఆమె స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఉందని తన మనసులోని మాటను బయటపెట్టారు. తనను కేవలం తెలుగు నటిగా మాత్రమే కాకుండా, ఒక ఇండియన్ యాక్ట్రెస్ లేదా వరల్డ్ యాక్ట్రెస్ గా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని ఆమె పేర్కొన్నారు.


## మహేష్ బాబుకు గురి

టాలీవుడ్ యువ నటుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో రూపొందిన దేవకి నందన వాసుదేవా అనే చిత్రంతో మానస వారణాసి తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పెద్ద స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. తాజాగా సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ చిత్రంలో హీరోయిన్గా నటించింది. తాజాగా విడుదల అయిన ఈ సినిమాకు మంచి టాక్ వస్తోంది. తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈమెకు తెలుగు సినిమా పరిశ్రమలో ఏ నటులు అంటే ఇష్టం? ఎవరితో సినిమా చేయాలని ఉంది అనే విషయాలను తెలియజేసింది. తాజాగా మానస వారణాసి మాట్లాడుతూ... నేను చిన్న వయసు నుండి టాలీవుడ్ స్టార్ హీరోలు అయినటువంటి మహేష్ బాబు, నాగార్జున, వెంకటేష్ సినిమాలు చూస్తూ పెరిగాను. వారి నటన చాలా ఇష్టం. వారిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఇక నాకు మహేష్ బాబు అంటే చాలా చాలా ఇష్టం. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే బాగుంటుంద'ని పేర్కొంది.



## రుక్మిణీ వసంత్‌కు వరుస ఆఫర్లు

రుక్మిణీ వసంత్ సౌత్ ఇండస్ట్రీలో మారుమ్రోగుతోన్న పేరు ఇది. కాంతార చాప్టర్ వన్‌లో కనకవతి పాత్రతో అమ్మడు ఊహించని రేంజ్ లో కనెక్ట్ అయింది. అందం, అభినయంతో తెలుగు ఆడియన్స్ కు మరింత దగ్గరైంది. అంతేనా వరుసగా పాన్ ఇండియా చిత్రాలకు కమిట్ అవుతూ అంతకంతకు సంచలనం అవుతోంది. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తోన్న టాక్సిక్‌లో అమ్మడు కీలక పాత్ర పోషిస్తోంది. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తోన్న మరో పాన్ ఇండియా చిత్రం డ్రాగన్ లోనూ ఛాన్స్ అందుకుంది. ఇదే ఊపులో రుక్మిణీ బాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతోంది. కార్తీక్ ఆర్యన్ హీరోగా కిల్ ఫేం నిఖిల్ నగేష్ ఓ చిత్రం తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. ఇందులో కార్తీక్ కి జోడీగా రుక్మిణీ వసంత్ ను తీసు కుంటున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇదొక ఇంటెన్స్ యాక్షన్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతుంది. టి సిరీస్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రపోజల్ దశలో ఉండగానే ప్రళయ్ ఓ జోంబీ చిత్రంలోనూ ఛాన్స్ అందుకుందనే వార్త వైరల్ గా మారింది. రణ వీర్ సింగ్ కథానాయకుడిగా జై మెహతా దర్శకత్వంలో ఈ చిత్రానికి సంబంధించి ప్రణాళిక సిద్ధమవుతోంది.




## ఐబొమ్మ రవి విడుదల



పైరసీ సినిమాల వెబ్ సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మంది రవి చంచల్ గూడ జైలు నుండి విడుదలయ్యారు. మంగళవారం కోర్టు రవికి బెయిల్ మంజూరు చేయగా నేడు బయటకు వచ్చాడు. ఐబొమ్మ వెబ్ సైట్ ద్వారా సినిమాలను పైరసీ చేస్తున్న కారణంగా రవిని మూడు నెలల క్రితం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ తరవాత పలుమార్లు కస్టడీలోకి తీసుకుని విచారించారు. విచారణలో కీలక అంశాలు బయటపడ్డాయి. రవి ఐలాండ్ నుండి పైరసీ సినిమాల వెబ్ సైట్ ను నిర్వహిస్తున్నాడని తేలింది. అంతేకాకుండా రవి ఏపీకి చెందిన వ్యక్తేనని పోలీసులు గుర్తించారు. భార్యతో విడాకులు తీసుకున్నట్టు సైతం విచారణలో తేలింది. అక్రమ సంపాదన కోసమే సినిమాలను పైరసీ చేయగా చిత్రపరిశ్రమకు వేల కోట్లు నష్టం వాటిల్లినట్టు పోలీసుగు గుర్తించారు. రవి పైరసీ సినిమాల ద్వారా బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తూ కోట్లు సంపాదించినట్టు గుర్తించారు. ఇక రవి జైలుకు వెళ్లిన నాటి నుండి అనేకసార్లు బెయిల్ కోసం ప్రయత్నించగా ఎట్టకేలకు ఆయన బయటకు వచ్చాడు.

## కొచ్చడయాన్.. రీ రిలీజ్!

2014లో విడుదలైన ఒక చిత్రం ఫ్లాప్ టాక్ తెచ్చుకొని రజనీకాంత్ ను నిరాశపరిచింది. పైగా ఆయన కూతురు సౌందర్య రజినీకాంత్ కూడా దర్శకురాలిగా చేసిన మొదటి సినిమా కూడా అదే కావడం గమనార్హం అయితే అలాంటి సినిమాపై ఎన్నో అంచనాలు ఉన్నా.. ఆ చిత్రం మాత్రం డిజాస్టర్ గా నిలిచింది. అయితే అలాంటి ఈ సినిమాను మళ్ళీ ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత ఏఐ ను ఉపయోగించి రీ ఎడిట్ చేశారు. ఈ మేరకు టీజర్ ను విడుదల చేయగా.. ఇది బాగా వైరల్ అవుతోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కొచ్చడయాన్. రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజినీకాంత్ దర్శకత్వం వహించిన తొలి పీరియాడికల్ యానిమేషన్ మూవీని సునంద మురళి మనోహర్, సునీల్, ప్రశీదా చౌదరి నిర్మించగా.. ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థ ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశారు. పైగా 2014లో ఈ సినిమాను తెలుగులో విక్రమసింహగా రిలీజ్ చేశారు. కానీ ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. అయితే ఇలాంటి సినిమాను ఇప్పుడు రీ రిలీజ్ కి సిద్ధం చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. అందులో భాగంగానే కొచ్చడయాన్ సినిమాను ఏఐతో కొత్త వెర్షన్ రెడీ చేశారు. ఈ రీ మాస్టర్డ్ కొచ్చడయాన్ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర బృందం టీజర్ ను మంగళవారం రోజు రిలీజ్ చేశారు. టీజర్ ను రిలీజ్ చేసిన మేకర్స్ రీ రిలీజ్ ఎప్పుడు చేస్తారు అన్నది ఇంకా స్పష్టం చేయలేదు.







# ఉత్కంఠ గెలుపు

### భారత్ వరుస విజయాలు.. భయపెట్టిన నెదర్లాండ్స్

## పసికూనల అద్భుత పోరాటం

టీ20 వరల్డ్ కప్‌లో భారత్ విజయ పరంపర కొనసాగుతోంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్ లో భారత జట్టు మరో విక్టరీ కొట్టింది. అహ్మదాబాద్ వేదికగా నెదర్లాండ్స్, భారత్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో బ్యాటింగ్, బౌలింగ్ లో అదరగొట్టిన భారత జట్టు, చివరి క్షణంలో విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ మ్యాచ్ లో నెదర్లాండ్స్ పై ఏకంగా 17 పరుగుల తేడాతో విజయం సాధించింది భారత జట్టు. ఈ మ్యాచ్ లో తొలిత బ్యాటింగ్ చేసింది భారత జట్టు. ఈ తరుణంలో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. శివం దుబే మెరుపు ఇన్నింగ్స్ ఆడిన నేపథ్యంలో ఈ స్కోర్ సాధించింది భారత్. అటు కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, తెలుగు కుర్రాడు తిలక్ వర్మ, చివరలో హార్దిక్ పాండ్యా మెరిశారు. దీంతో నెదర్లాండ్స్ ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది భారత్. అయితే లక్ష్య ఛేదనలో చివరి వరకు పోరాడిన నెదర్లాండ్స్ ఓడిపోయింది. ఈ మ్యాచ్ లో 20 ఓవర్లు ఆడిన నెదర్లాండ్స్, 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 17 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది. ఇక ఈ నెల 21వ తేదీ నుంచి టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 పోరు షురూ కానుంది.



## 7 మ్యాచ్‌ల్లో 5 డకౌట్లు

### అభిషేక్ శర్మ చెత్త రికార్డ్

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వరుసగా తన మూడో మ్యాచ్‌లోనూ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ(0) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దాంతో టీ20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ డకౌట్స్ అయిన బ్యాటర్‌గా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లో గోల్డెన్ డక్ ఔట్ అయిన అభిషేక్ శర్మ.. అనారోగ్యంతో నమీబియాతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు రీఎంట్రీ ఇచ్చిన 4 బాల్ డక్‌గా వెనుదిరిగాడు. సూపర్-8 దశకు ముందు నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఫామ్ అందుకుంటాడని భావించిన అభిమానులను తీవ్రంగా నిరాశపర్చాడు. భారత సంతతి బౌలర్, స్పిన్నర్ ఆర్యన్ దత్ వేసిన బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అభిషేక్ శర్మ ఆడిన గత 7 ఇన్నింగ్స్‌ల్లో ఐదు సార్లు డకౌటవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గత 7 ఇన్నింగ్స్‌ల్లో అభిషేక్ శర్మ.. 0 (1), 68(20), 0 (1), 30 (16), 0 (1), 0 (4), 0 (3) ఒకే ఒక్క హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. ఇందులో వరుసగా మూడు డకౌట్స్ ఉండటం, కీలక సూపర్-8 దశ ముందు అతను ఫామ్ కోల్పోవడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పేలవ ప్రదర్శనతో అభిషేక్ శర్మ తన పేరిట పలు చెత్త రికార్డ్‌లను లిఖించుకున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన నాలుగో బ్యాటర్, రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో భారత దిగ్గజ పేసర్ ఆశిష్ నెహ్రా, వెస్టిండీస్ ప్లేయర్ ఆండ్రీ ఫ్లెచర్, ఉగాండ ఆటగాడు రోజర్ ముకాస, అభిషేక్ శర్మ కంటే ముందున్నారు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సార్లు డకౌట్ అయిన తొలి భారత ఓపెనర్‌గా కూడా అభిషేక్ శర్మ అప్రతిష్టను మూటగట్టుకున్నాడు.

**పురుషుల టీ20 ప్రపంచకప్‌లో వరుసగా అత్యధిక సార్లు డకౌట్ అయిన ఆటగాళ్లు**

- 3 – ఆశిష్ నెహ్రా (భారత్, 2010-2016)
- 3 – ఆండ్రీ ఫ్లెచర్ (వెస్టిండీస్, 2009)
- 3 – రోజర్ ముకాస (ఉగాండ, 2024)
- 3 – అభిషేక్ శర్మ (భారత్, 2025)

## నమీబియాపై పాక్ విన్

### సూపర్-8 కు చేరిక.. అమెరికా నిష్క్రమణ

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో పాకిస్థాన్ సూపర్-8కు అర్హత సాధించింది. టోర్నీలో ముందుడుగు వేయాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ సమష్టిగా చెలరేగింది. గ్రూప్-ఏలో భాగంగా బుధవారం కొలంబో వేదికగా నమీబియాతో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్థాన్ 102 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. షాహిబ్జాదా ఫర్హాన్ అజేయం శతకంతో సత్తా చాటగా ఉస్మాన్ తారిక్(4/16) నాలుగు వికెట్లతో నమీబియా పతానాన్ని శాసించాడు. ఈ విజయంతో గ్రూప్-ఏ




నుంచి భారత్‌తో పాటు పాకిస్థాన్ సూపర్-8కు అర్హత సాధించింది. మరోవైపు నమీబియా ఓటమితో ప్రపంచకప్ టోర్నీని ముగించింది. పాకిస్థాన్ విజయంతో భారత ఎన్ఆర్ఐ ఆటగాళ్లతో కూడిన అమెరికా జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. నమీబియా, నెదర్లాండ్స్‌పై గెలిచిన అమెరికా.. పాకిస్థాన్, భారత్ చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 3 వికెట్లకు 199 పరుగుల భారీ స్కోర్ చేసింది. షాహిబ్జాదా ఫర్హాన్ (58 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. కెప్టెన్ సల్మాన్ అఘా(23 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), షాదాబ్ ఖాన్(22 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) రాణించారు. నమీబియా బౌలర్లలో జాక్ బ్రెస్సెల్(2/48) రెండు వికెట్లు తీయగా.. గెర్హార్డ్ ఎరాస్మస్(1/25) ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం నమీబియా 17.3 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. లారెన్ స్టీన్‌కాంప్(23), అలెగ్జండర్(20) టాప్ స్కోరర్లుగా నిలవగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. పాకిస్థాన్ బౌలర్లలో ఉస్మాన్ తారిక్(4/16) నాలుగు వికెట్లతో సత్తా చాటగా.. షాదాబ్ ఖాన్(3/19) మూడు వికెట్లు తీసాడు. సల్మాన్ మిర్జా, మహమ్మద్ నవాజ్ తలో వికెట్ తీసారు.

**పాకిస్థాన్ సూపర్-8 షెడ్యూల్**

ఫిబ్రవరి 21: పాకిస్థాన్ వర్సెస్ న్యూజిలాండ్ కొలంబో (శ్రీలంక) రాత్రి 7:00
ఫిబ్రవరి 24 పాకిస్థాన్ వర్సెస్ ఇంగ్లండ్ క్యాండీ (శ్రీలంక) రాత్రి 7:00
ఫిబ్రవరి 28 పాకిస్థాన్ వర్సెస్ శ్రీలంక క్యాండీ (శ్రీలంక) రాత్రి 7:00




## సూపర్-8 చేరిన జట్లు ఇవే

**ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ లీగ్ మ్యాచ్‌లు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 20 జట్లు బరిలోకి దిగిన ఈ టోర్నీలో 8 టీమ్స్ ముందడుగు వేసాయి. 20 జట్లను మొత్తం నాలుగు గ్రూప్‌లుగా విభజించగా.. ప్రతీ టీమ్ తమ గ్రూప్‌లోని ప్రత్యర్థి జట్టుతో ఒక్కో మ్యాచ్ ఆడింది. ఈ లెక్కన ప్రతీ జట్టు 4 లీగ్ మ్యాచ్‌లు ఆడింది. ప్రతీ గ్రూప్‌లోని టాప్-2 టీమ్స్ సూపర్-8కు అర్హత సాధిస్తాయి.**

**సూపర్-8 చేరిన జట్లు ఇవే..**

గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా తలపడ్డాయి. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన భారత్ గ్రూప్ టాపర్‌గా నిలవగా.. నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలిచిన పాకిస్థాన్ రన్నరప్‌గా సూపర్-8 చేరింది. అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

గ్రూప్-బీలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన శ్రీలంక, మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచి, ఒకటి రద్దవ్వడంతో జింబాబ్వే సూపర్-8కు అర్హత సాధించాయి. ఐర్లాండ్, ఆస్ట్రేలియా, ఒమన్ లీగ్ దశలోనే వెనుదిరిగాయి. ఈ గ్రూప్ నుంచి ఆసీస్ వైదొలగడం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది.

గ్రూప్ సీలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన వెస్టిండీస్, 4 మ్యాచ్‌ల్లో 3 గెలిచిన ఇంగ్లండ్ సూపర్-8కు క్వాలిఫై అయ్యాయి. స్కాంట్లాండ్, ఇటలీ, నేపాల్ తప్పుకున్నాయి.

గ్రూప్-డీలో 4 మ్యాచ్‌లకు 4 గెలిచిన సౌతాఫ్రికా, నాలుగింటిలో మూడు గెలిచిన న్యూజిలాండ్ ముందడుగు వేయగా.. అఫ్గానిస్థాన్, యూఏఈ, కెనడా నిష్క్రమించాయి.

**గ్రూప్-ఏ:** భారత్, పాకిస్థాన్.. **గ్రూప్-బీ:** శ్రీలంక, జింబాబ్వే
**గ్రూప్-సీ:** వెస్టిండీస్, శ్రీలంక.. **గ్రూప్-డీ:** సౌతాఫ్రికా, న్యూజిలాండ్



## సూపర్-8 షెడ్యూల్..

ఫిబ్రవరి 21: న్యూజిలాండ్ వర్సెస్ పాకిస్థాన్ గ్రూప్ 2 కొలంబో రాత్రి 7:00
ఫిబ్రవరి 22 ఇంగ్లాండ్ వర్సెస్ శ్రీలంక గ్రూప్ 2 క్యాండీ మధ్యాహ్నం 3:00
ఫిబ్రవరి 22 భారత్ వర్సెస్ సౌతాఫ్రికా గ్రూప్ 1 అహ్మదాబాద్ రాత్రి 7:00
ఫిబ్రవరి 23 వెస్టిండీస్ వర్సెస్ జింబాబ్వే గ్రూప్ 1 ముంబై రాత్రి 7:00
ఫిబ్రవరి 24 ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ గ్రూప్ 2 క్యాండీ రాత్రి 7:00
ఫిబ్రవరి 25 శ్రీలంక వర్సెస్ న్యూజిలాండ్ గ్రూప్ 2 కొలంబో రాత్రి 7:00
ఫిబ్రవరి 26 వెస్టిండీస్ వర్సెస్ సౌతాఫ్రికా గ్రూప్ 1 అహ్మదాబాద్ మధ్యాహ్నం 3:00
ఫిబ్రవరి 26 భారత్ వర్సెస్ జింబాబ్వే గ్రూప్ 1 చెన్నై రాత్రి 7:00
ఫిబ్రవరి 27 ఇంగ్లాండ్ వర్సెస్ న్యూజిలాండ్ గ్రూప్ 2 కొలంబో రాత్రి 7:00
ఫిబ్రవరి 28 శ్రీలంక వర్సెస్ పాకిస్థాన్ గ్రూప్ 2 క్యాండీ రాత్రి 7:00
మార్చి 1 సౌతాఫ్రికా వర్సెస్ జింబాబ్వే గ్రూప్ 1 ఢిల్లీ మధ్యాహ్నం 3:00
మార్చి 1 భారత్ వర్సెస్ వెస్టిండీస్ గ్రూప్ 1 కోల్‌కతా రాత్రి 7:00

## ఇషాన్ కిషన్ నం.8

### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సునామీ
### ఏకంగా 17 స్థానాలు పైపైకి..!

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత యువ కెరటం ఇషాన్ కిషన్ అదరగొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ భారీ జంప్ చేశాడు. ఇషాన్ ఏకంగా 17 స్థానాలను మెరుగుపరుచుకున్నాడు. ఇటీవల జరిగిన మ్యాచ్‌లలో తన దూకుడుతో పరుగుల వర్షం కురిపించిన ఇషాన్ కిషన్.. తాజా ర్యాంకింగ్స్‌లో 8వ స్థానానికి చేరుకున్నాడు. టాప్-10లో చోటు దక్కించుకోవడమే కాకుండా తన రేటింగ్‌ను గణనీయంగా పెంచుకోవడంలో ఇషాన్ కిషన్ సక్సెస్ అయ్యాడు. 197.50 స్ట్రైక్ రేట్‌తో ఇషాన్ కిషన్ చేసిన పరుగులు ఐసీసీ పాయింట్ల పట్టికలో భారీ మార్పులకు కారణమయ్యాయి. మరోవైపు భారత యువ సెన్సేషన్ అభిషేక్ శర్మ తన నంబర్ 1 స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గత కొన్ని ఇన్నింగ్స్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. తన వద్ద ఉన్న 891 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా అభిషేక్ శర్మ కొనసాగుతున్నాడు. ఇక టీ20 స్పెషలిస్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన నిలకడైన ప్రదర్శనతో 6వ స్థానంలో స్థిరంగా ఉండగా.. యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 4వ ర్యాంకుకు చేరుకున్నాడు. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు ఉండటం టీమిండియా బ్యాటింగ్ బలానికి నిదర్శనం. తాజా ర్యాంకింగ్స్‌లో ఇతర దేశాల ఆటగాళ్లలో కూడా భారీ మార్పులు కనిపించాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో కొనసాగుతుండగా.. టీ20 ప్రపంచకప్‌లో సెంచరీతో అదరగొట్టిన శ్రీలంక బ్యాటర్ పాతుమ్ నిస్సంకా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును కైవసం చేసుకున్నాడు.



**టాప్-10 బ్యాటర్లు**

1. అభిషేక్ శర్మ
2. ఫిల్ సాల్ట్
3. పాతుమ్ నిస్సంకా
4. తిలక్ వర్మ
5. సాహిబ్జాదా ఫర్హాన్
6. సూర్యకుమార్ యాదవ్
7. జోస్ బట్లర్
8. ఇషాన్ కిషన్
9. టిమ్ సీఫర్ట్
10. ట్రావిస్ హెడ్

## యూఏఈపై దక్షిణాఫ్రికా విజయం

టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ డీ మ్యాచ్‌లో ఇవాళ దక్షిణాఫ్రికా జట్టు ఆరు వికెట్ల తేడాతో యూఏఈపై విజయం సాధించింది. దీంతో తమ గ్రూపులోని అన్ని మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విక్టరీ నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 122 రన్స్ చేసింది. టాపార్డర్‌లో అలీషాన్ షారఫూ అత్యధికంగా 45 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను కేవలం 13.2 ఓవర్లలో సఫారీలు అందుకున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ రికల్టన్ 16 బంతుల్లో 30 రన్స్ చేయగా, బ్రెవిస్ 25 బంతుల్లో 36 రన్స్ స్కోరు చేశారు. మరో 40 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా విజయ కేతనం ఎగురవేసింది. సఫారీ బౌలర్ కార్బిన్ బాష్ ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసుకున్నాడు. గ్రూపు డీ నుంచి ఇప్పటికే దక్షిణఫ్రికాతో పాటు న్యూజిలాండ్ .. సూపర్-8 స్టేజ్‌కు క్వాలిఫై అయ్యాయి.

# భవిష్యత్తుపై 'బేరసారాలు'



ఉన్నత చదువులు చదివి, ఉజ్వల భవిష్యత్తు కోసం అడుగులు వేయాల్సిన విద్యార్థులను ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల పేరుతో వేధిస్తుండటం గర్హనీయం. ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రావడం లేదనే సాకుతో, విద్యార్థులు చదువు పూర్తిచేసుకుని వెళ్లే సమయంలో వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా నిలిపివేయడం ఒక అక్రమ సంప్రదాయంగా మారింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులు ఈ అంశంపై అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేశాయి. విద్యార్థుల సర్టిఫికెట్లు వారి వ్యక్తిగత ఆస్తి అని, ఫీజుల రికవరీ కోసం వాటిని తాకట్టు పెట్టుకునే హక్కు ఏ విద్యా సంస్థకూ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. విద్యార్థుల ఫలితాలను లేదా సర్టిఫికెట్లను బేరసారాల కోసం వాడుకోవడం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఉల్లంఘన అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అభివర్ణించింది. కాలేజీల వేధింపుల నుంచి విద్యార్థులను రక్షించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం లేదా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కోర్టులు ప్రభుత్వాన్ని ఆదేశించాయి. ప్రభుత్వాలు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల కాలేజీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవమే కావచ్చు. కానీ, ప్రభుత్వంతో ఉన్న వివాదంలో విద్యార్థులను పావులుగా వాడుకోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు. సర్టిఫికెట్లు అందక ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు విద్యార్థులు దూరమవుతుంటే ఆ నష్టానికి బాధ్యులెవరు? కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి సర్టిఫికెట్లు నిలిపివేసే కాలేజీల గుర్తింపును రద్దు చేయడం లేదా భారీ జరిమానాలు విధించడం వంటి చర్యలకు ఉన్నత విద్యామండలి పూనుకోవాలి. ఫీజు బకాయిలను సకాలంలో చెల్లించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. విద్యార్థుల సర్టిఫికెట్లు వారి సంవత్సరాల కష్టానికి ప్రతిరూపాలు. వాటిని ఫీజుల రికవరీకి 'పూచీకత్తు'గా మార్చడం విద్యాలయాల విలువలకే తలవంపులు. ఇప్పటికైనా విద్యా సంస్థలు తమ వైఖరిని మార్చుకోవాలి, ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం

శివాజీ మహారాజ్ కేవలం భూభాగాన్ని జయించాలని కోరుకోలేదు; ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడే 'హిందూ స్వరాజ్యాన్ని' స్థాపించడమే తన లక్ష్యంగా పెట్టుకున్నారు. నేటి యువత కేవలం వ్యక్తిగత ఎదుగుదలకే పరిమితం కాకుండా, దేశాభివృద్ధిలో తాము ఎలా భాగస్వామ్యం కాగలమో ఆలోచించాలి. దేశంపై ప్రేమ కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, సమాజ సేవలోనూ, బాధ్యతాయుతమైన పౌరసత్వంలోనూ ప్రతిబింబించాలి. అఫ్జల్ ఖాన్‌ను చంపిన సందర్భం కావొచ్చు లేదా ఆగ్రా కోట నుంచి తప్పించుకున్న తీరు కావొచ్చు–శివాజీది కేవలం శారీరక బలం మాత్రమే కాదు, అద్భుతమైన మానసిక బలం.



## అచంచలమైన దేశభక్తి.. శివాజీ మహారాజ్

జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా, 'గెరిల్లా తంత్రం' వంటి వ్యూహాలతో సమస్యలను అధిగమించాలి. ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు, భయాన్ని జయించి తెలివితేటలతో ముందడుగు వేయడం. యుద్ధ సమయంలో శత్రువుల కుటుంబాలకు చెందిన మహిళలను కూడా 'తల్లి'గా గౌరవించిన గొప్ప సంస్కృతి శివాజీది. కళ్యాణ్ సుబేదార్ కోడలిని గౌరవంగా వెనక్కి పంపిన ఉదంతం దీనికి నిదర్శనం. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాల నేపథ్యంలో, శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళల భద్రతకు, గౌరవానికి యువత అండగా నిలవాలి. శివాజీ వ్యక్తిగత దైవభక్తి కలిగి ఉన్నప్పటికీ, ఇతర మతాల ప్రార్థనా స్థలాలను ధ్వంసం చేయకుండా గౌరవించారు. ఆయన సైన్యంలో ముస్లింలు కూడా కీలక బాధ్యతల్లో ఉండేవారు. దేశ పురోగతికి విఘాతం కలిగించే విభజన రాజకీయాలకు దూరంగా ఉండి, సమగ్రతను చాటాలి. నైతిక విలువలతో కూడిన నాయకత్వాన్ని అలవరుచుకోవాలి. భారతీయ నావికా దళ పితామహుడిగా పేరుగాంచిన శివాజీ, సముద్ర మార్గం ద్వారా వచ్చే ముప్పును ముందే గుర్తించారు. భవిష్యత్తు అవసరాలను (ఏఐ, టెక్నాలజీ, పర్యావరణ మార్పులు) ముందే ఊహించి, అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదు, ఒక గొప్ప వ్యవస్థా నిర్మాత. ఆయన జయంతి రోజున యువత 'నా దేశం–నా బాధ్యత' అనే భావనతో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. శివాజీ మహారాజ్ సుమారు 300 కోటలను తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఆయన కేవలం కోటలను ఆక్రమించడమే కాదు, వ్యూహాత్మక ప్రాంతాల్లో కొత్త వాటిని నిర్మించారు. రాయ్‌గఢ్ 'మరాఠా సామ్రాజ్యానికి రాజధాని'. ఇది సముద్ర మట్టానికి సుమారు 2,700 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ కోట ఒకవైపు కేవలం నిటారుగా ఉండే కొండ భాగం కావడం వల్ల శత్రువులకి ఇది ఏమాత్రం అందుబాటులో ఉండేది కాదు. రాయ్‌గఢ్ కోట చరిత్ర గురించి ఇక్కడ చూడవచ్చు. ప్రతాప్‌గఢ్‌లోనే అఫ్జల్ ఖాన్‌ను శివాజీ ఎదుర్కొన్నది ఇక్కడే. ఈ కోట చుట్టూ దట్టమైన అడవి ఉండటం వల్ల శత్రువుల కదలికలను ముందే కనిపెట్టే వీలుండేది. 'భారత నావికాదళ పితామహుడు'గా శివాజీకి పేరు రావడానికి కారణం సింధుదుర్గ్ సముద్ర కోట. అరేబియా సముద్రం మధ్యలో ఒక చిన్న ద్వీపంలో దీనిని నిర్మించారు. సముద్రపు అలల తాకిడిని తట్టుకోవడానికి దీని పునాదిలో టన్నుల కొద్దీ సీసాన్ని ఉపయోగించారు. శివాజీ మహారాజ్ నిర్మించిన మురుద్ జంజీరా జలదుర్గం అజేయమైంది. మొఘలులు, మరాఠాలు, పోర్చుగీసు వారు దీనిని జయించడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినా ఇది లొంగలేదు. ఒక కోట నిర్మించేటప్పుడు అక్కడ నీటి వనరులు, ధాన్యాగారాలు కనీసం ఏడాది పాటు సరిపో యేలా ప్లాన్ చేసేవారు. యువత కూడా తమ కెరీర్ లేదా జీవితంలో ముందస్తు ప్రణాళిక కలిగి ఉండాలి. ఉన్న వనరుల తోనే (స్థానిక రాళ్లు, మట్టి) ప్రపంచం గర్వించే కట్టడాలను నిర్మించారు. అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని గొప్ప ఫలితాలు సాధించాలని యువతకు సూచిస్తాయీ కట్టడాలు.



రణధీర్ గుండు

## హిందూత్వ వైపు నవతరం అడుగులు

నేటి భారతదేశ రాజకీయ, సామాజిక ముఖచిత్రంలో ఒక కీలక మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. అది యువతలో హిందూత్వ భావజాలం పట్ల పెరుగుతున్న ఆసక్తి, అనుబంధం. ఒకప్పుడు కేవలం సంప్రదాయవాదానికి పరిమితమైన ఈ భావజాలం, నేడు ఆధునిక విద్యావంతులైన యువతను సైతం విశేషంగా ఆకర్షిస్తోంది. నేటి యువతలో సుమారు 90 శాతం మంది వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ (ట్విట్టర్) వంటి మాధ్యమాల్లో హిందూ సంస్కృతి, చరిత్ర, జాతీయవాదానికి సంబంధించిన అంశాలు విరివిగా ప్రచారం చేస్తున్నారు.



అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి చారిత్రక ఘట్టాలు యువతలో తమ మతపరమైన మూలాల పట్ల గర్వాన్ని పెంచాయి. ఇది కేవలం మతపరమైన నమ్మకం కాకుండా, ఒక జాతీయ గుర్తింపుగా మారుతోంది. ప్రస్తుత ప్రభుత్వ విధానాలు, "నవ భారత్" నిర్మాణం వంటి నినాదాలు యువతలో దేశభక్తిని హిందూత్వ భావజాలంతో జోడించాయి. వికసిత భారత్ లక్ష్యం వైపు యువత శక్తిని మళ్లించే ప్రయత్నాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. గత చరిత్రను హిందూ కోణంలో తిరగరాయాలనే ఆకాంక్ష, పాఠ్యపుస్తకాల్లో మార్పుల పట్ల పెరుగుతున్న ఆసక్తి కూడా యువతను ప్రభావితం చేస్తోంది. అయితే, ఈ ధోరణి వల్ల లౌకికవాద పునాదులు బలహీనపడతాయని, మైనారిటీల పట్ల విద్వేషం పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారం యువతను అతివాదం వైపు మళ్లించే ప్రమాదం ఉందని నివేదికలు చెబు తున్నాయి. యువతలో పెరుగుతున్న ఈ భావజాలం ఒక మతపరమైన మార్పు మాత్రమే కాదు, అది భారతదేశ భవిష్యత్తు రాజకీయ దిశను నిర్దేశించే ఒక సామాజిక పరిణామం. ఆధ్యాత్మిక విలువలతో కూడిన ఆధునికతను అందిపుచ్చుకుంటూనే, రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సహజీవనం వంటి విలువలపై యువతకు సరైన అవగాహన కల్పించడం నేటి అవసరం.

- విశ్వజిత్ పరందాములు

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.